


# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 07-05-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 205 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# ఒడిశాకు సాయం

- రూ.వెయ్యి కోట్లు
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు
- క్షతగాత్రులకు రూ. 50 వేలు
- ఒడిశాలో ప్రధాని ఏరియల్ సర్వే
- జలదిగ్బంధంలో తీర ప్రాంతాలు



భువనేశ్వర్: ఫాని తుఫాను సృష్టించిన బీభత్సంతో అతలాకుతలమైన ఒడిశా రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం పర్యటించారు. ఈ మేరకు ఉదయం భువనేశ్వర్ ఎయిర్ పోర్టుకు చేరుకున్న ఆయనకు ఒడిశా గవర్నర్ గణేశీ లాల్, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ స్వాగతం పలికారు. అనంతరం ఆయన గవర్నర్, సీఎం, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌తో కలిసి తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు రూ. రెండు లక్షల నష్టపరిహారం ప్రకటించారు. అలాగే గాయపడ్డ వారికి రూ.50వేలు అందజేస్తామన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటికే రాష్ట్రానికి రూ.381 కోట్ల ఆర్థిక సాయం ప్రకటించామని, సహాయ పునరావాస కార్యక్రమాల నిమిత్తం మరో రూ.వెయ్యి కోట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. పెను విపత్తు సందర్భంగా తరువాయి 2లో..

- రూ.15కోట్ల సాయం
- బాధితులను మానవతాదృక్పథంతో ఆదుకోవాలి
- ఆస్తి, పంటనష్టం అపారం
- స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి
- ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి: ఫాని తుపాను ధాటికి కకావికలమైన ఒడిశాకు ఏపీ ప్రభుత్వం బాసటగా నిలిచింది. తుపాను బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.15 కోట్లు సాయంగా ఇవ్వనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇప్ప టికే సీఎంవో అధికారులతో చర్చించిన చంద్రబాబు ఈ మేరకు.. ఒడిశాకు ఆర్థిక సాయాన్ని ప్రకటిం చారు. ఫాని తుపానుతో ఒడిశా తీవ్రంగా నష్టపోయిందన్నారు. విపత్తుల వల్ల కలిగే నష్టతీవ్రత అపారమని చెప్పారు. తుపాను బాధితులను మానవతాదృక్పథంతో ఆదుకోవాలన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలూ ఒడిశాకు అండగా ఉండాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఒడిశా ప్రభుత్వానికి అన్నివిధాలా సాయం అందిస్తామన్నారు. విద్యుత్ రంపాలు, సిబ్బందిని ఇప్పటికే ఒడిశాకు పంపామని చెప్పారు. పొరుగు రాష్ట్రం కష్టాల్లో ఉన్నప్పుడు గతంలోనూ ఆదుకున్నామని.. ఇప్పుడూ అండగా ఉంటామని వివరించారు. ఇప్పటికీ ఒడిశాలో చాలా గ్రామాల్లో కరెంటు లేదని.. తాగడానికి నీళ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆస్తి, పంటనష్టం అపారంగా జరిగిందని, ఎవరికి వారు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఆదుకోవాలని చంద్రబాబు కోరారు. ఒడిశా తుపాను బాధితులకు తాగునీరు, ఆహారం, పాలు, కూరగాయలు సరఫరా చేయాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి బాధితులను ఆదుకోవాలని పిలుపునిచ్చారు.

చందనోత్సవ శుభాకాంక్షలు






## ముగిసిన ఐదో దశ పోలింగ్

7 రాష్ట్రాలు, 674 మంది అభ్యర్థులు .. మే 12, 19 ఆరు, ఏడు దశల్లో ఎన్నికలు

మే 23 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు

దిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం జరుగుతున్న ఐదో దశ పోలింగ్ ముగిసింది. సోమవారం మొత్తం ఏడు రాష్ట్రాల్లోని 51 స్థానాలకు గానూ ఎన్నికలు జరిగాయి. బిహార్‌లోని 5, జమ్ముకశ్మీర్‌లోని 2, మధ్యప్రదేశ్‌లోని 7, ఝార్ఖండ్‌లోని 4, రాజస్థాన్‌లోని 12, ఉత్తర్‌ప్రదేశ్‌లోని 14, పశ్చిమ బెంగాల్‌లోని 7 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఏప్రిల్ 23న నిర్వహించిన మూడో దశ ఎన్నికల్లో అత్యధిక స్థానాలకు (115) పోలింగ్ జరగగా, సోమవారం జరిగిన తరువాయి 2లో..




చందన స్వామిని దర్శించండి !
సిరులతో తులతూగండి !!



మిత్రులకు, శ్రేయోభిలాషులకు
విశాఖ నగర ప్రజలకు
శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి
చందనోత్సవ శుభాకాంక్షలు

Film and Political News,
జిల్లాల సమాచారం
General Knowledge
ఇతర సమాచారం కోసం నేడే
click చేయండి
SPYTALKIES.COM

EDITOR : LAKKOJU NOOKARAJU
M.A., (Journalism and Mass Communication)., M.A. (Education).,
M.A. History., M.A. (Telugu)., Telugu Pandit (TPT)

## హైదరాబాద్ శివారులో అగ్నిప్రమాదం

108 వాహనాలు భస్మీపటలం

హైదరాబాద్: మండుతున్న ఎండలు.. ఠారెత్తుతున్న జనాలు.. హైదరాబాద్ శివారులోని శామీర్‌పేట్ మండలం, దేవరయాంజాల్‌లో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో అక్కడ పార్క్ చేసిన 108 వాహనాలు తగులబడ్డాయి. జీవీకే, ఈఎంఆర్ఐకి సంబంధించిన వాహనాలు దేవరయాంజాల్‌లో పార్కు చేస్తుంటారు. పాడైపోయిన తరువాయి 2లో..

## పెండింగ్ కోర్టు కేసులపై శ్రద్ధ వహించాలి

జిల్లా కలెక్టర్ కె.భాస్కర్



విశాఖపట్నం: వివిధ శాఖలలో పెండింగ్‌లో ఉన్న గ్రీవెన్స్ పిటిషన్లను ఆయా శాఖల అధికారులు స్వయముగా పరిశీలించి తగు చర్యలు చేపట్టి పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం ఉదయం కలక్టరు మీకోసం , మీ సేవ, ఇ - ఆఫీసు నిర్వహణ, పెండింగ్ కోర్టు కేసులు తదితర అంశాలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలక్టరు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలను అధిక కాలం వేచి ఉంచడం సరికాదన్నారు. పోలీసు, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖలలో అధిక సంఖ్యలో పెండింగులో ఉంటున్నా యన్నారు. ప్రతి తరువాయి 2లో..



# 10 సీబీఎస్ఇ ఫలితాలలో శ్రీచైతన్య విద్యార్థుల సంచలనం



సత్యంరాజ్ మార్కులు- 488 | కిషన్ అనుచార్ మార్కులు- 486 | జామి అశ్రీత మార్కులు- 485 | ఎ.సాహితి మార్కులు- 485 | ఎ.వి.ఎస్.ఉషశ్రీ మార్కులు- 485 | వన్షిక సింగ్ మార్కులు- 484 | అదితి కుమారి మార్కులు- 484

విశాఖపట్నం : ఐఐటిలలో అడ్మిషన్లు సాధించడమే లక్ష్యంగా ఏర్పడిన శ్రీచైతన్య స్కూల్, టెక్నో విద్యార్థులు నేడు విడుదలైన 10వ తరగతి (సీబీఎస్ఇ) పరీక్షా ఫలితాలలో కూడా అత్యధికంగా 497, 495, 492, 491 మార్కులు సాధించి సీబీఎస్ఇ బోర్డు మార్కులలో చరిత్ర తిరగరాశారు.

ఒక్క విశాఖపట్నం సిటీ నుండే 480కు పైగా 13గురు విద్యార్థులు టాపర్స్‌గా నిలిచి సంచలనం సృష్టించి మరే ఇతర విద్యాసంస్థలకు అందనంత ఎత్తులో అగ్రస్థానంలో నిలిచారు.

(1) సత్యం రాజ్ - 488 (2) కిషన్ అనుచార్ - 486 (3) జామి ఆశ్రీత - 485 (4) ఎ.సాహితి - 485 (5) ఎ.వి.ఎస్. ఉష్రశీ - 485 (6) వన్షిక సింగ్ - 484 (7) అదితి కుమారి - 484 (8) అర్విన్ దత్త - 483 (9) రియా భరధ్వాజ్ - 482 (10) ఆఫికీ అహ్మద్ - 482 (11) అనిక కుమారి - 482 (12) అక్షయ కౌషిక్ - 481

(13) అనీష భారతి - 481 అలాగే 475 (95%) మార్కులకు పైగా 34మంది విద్యార్థులు మరియు 450 (90%) మార్కులకు పైగా 107మంది విద్యార్థులు సాధించి రికార్డు సృష్టించారని శ్రీచైతన్య స్కూల్స్, ఉత్తరాంధ్ర ఎ.జి. ఎమ్. - ఎమ్.వి.సురేష్ తెలిపారు. కాంపిటీటివ్ ఎగ్జామ్స్ లక్ష్యంగా ప్రిపేర్ అయ్యే మా విద్యార్థులు 10వ తరగతి సీబీఎస్ఇ పరీక్షలలో కూడా నెం.1 ఫలితాలను సాధించడం నిజంగా సంచలనమేనని పేర్కొన్నారు.అద్భుత ఫలితాలను సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మరియు అధ్యాపకులకు శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత చైర్మన్ డాక్టర్. శ్రీ బి. ఎస్. రావు అభినందనలు తెలియజేశారు.

ఈ సందర్భంగా అకడమిక్ డైరక్టర్ సీమ మాట్లాడుతూ తాము ప్రత్యేకంగా రూపొందించిన టెక్నో, సి-బ్యాచ్, సి-ఐపియల్ మరియు మెడికాన్ వంటి ప్రోగ్రామ్స్, ఫేజ్ రివిజన్ ప్రోగ్రామ్స్ మరియు ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ద వహించి ప్రోత్సహించడం ద్వారానే తాము ఇటువంటి ఫలితాలను సాధించగలిగామని ఆమె తెలియజేశారు. అలాగే జాతీయ, అంతర్జాతీయ ఒలింపియాడ్ పరీక్షలలో కూడా శ్రీచైతన్య విద్యార్థులే అత్యధిక ర్యాంకులను సాధిస్తూ ఇండియాలోనే నెం.1 స్కూల్స్‌గా నిలిపారన్నారు.

ఈ సందర్భంగా రీజనల్ ఇన్ ఛార్జెస్ - అహ్మద్ ఆలీ, వై.ఆశిబాబు మరియు ఎమ్.రమణ, ప్రిన్సిపాల్స్ - కె.వి.పి.సూర్యనారాయణ, లతా సువర్ణ మరియు ఎల్. శ్రీలక్ష్మి, అకడమిక్ కో-ఆర్డినేటర్ ఎల్.రాజేష్ మరియు అకడమిక్ డీన్లు విద్యార్థులకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు.

# నవ్వించడమే నిజమైన వైద్యం



అనకాపల్లి : ఎదుటి వారిని నవ్వించడమే నిజ మైన వైద్యమని యూవర్స్ లవిగ్లీ చిత్ర దర్శకులు జో అన్నారు. స్దానిక గవరపాలెం గౌరీ సేవా సంఘం మళ్ల జగన్నాదం కళ్యాణ మండపంలో ఆదివారం రాత్రి లాఫింగ్ క్లబ్ హాస్య వల్లరి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేసి, సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుత కాలంలో ప్రతీ ఒక్కరూ ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. దీనివలన బీపీ సుగర్ వంటి వ్యాధులు సోకుతున్నా యన్నారు. కొంతసేపు ప్రతీ రోజు నవ్వుకుంటే ఇటువంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చునన్నారు. టార్గెట్‌లపేరుతో ఒత్తిడికి గురవుతున్నారని, అన్నారు. విశ్రాంతి లేకుండా నిత్యం ఏదో ఒక పనిచేస్తూ పోతే ఖచ్చితంగా ఫలితాలు వస్తాయన్నారు. ప్రతీ దానికి ఒత్తిడికి గురికావడం తగదన్నారు. నవ్వుతూ నవ్విస్తూ ఉండాలన్నారు. అలాగే మరొక ముఖ్య అతిధిగా విచ్చేసిన సినీ నటీ కరాటే కళ్యాణి మాట్లాడుతూ లాఫింగ్ క్లబ్ ప్రతీ నెల మొదటి ఆదివారం క్రమం తప్పకుండా హాస్యవల్లరి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాలను ఆదరిస్తున్న ప్రేక్షకులు కృతజ్ఞతలు తెలియజేసారు. ముందుగా ఎఫ్ఎం బాబాయ్ బృందం ప్రదర్శించిన స్కిట్ల్ అందరినీ ఆదరించాయి. ఈసందర్భంగా నిర్వాహకులు దర్శకుడిని కళ్యాణినీ సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్సులు మళ్ల సురేంద్ర, శేఖర్ పంతులు, డివి కృష్ణారావు, మళ్ల సూరిబాబు, మళ్ల భువన్, సినీనటుడు బాబుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌కు 54 అర్జీలు



విజయనగరం: జిల్లాలో వివిధ ప్రాంతాలనుంచి 54 అర్జీలు మీ కోసం కార్యక్రమంలో వచ్చాయి. సోమవారం కలక్టరేట్ ఆడిటోరియంలో జాయింట్ కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణపు బిల్లులు, ఫించన్లు, భూ సమస్యలకు సంబంధించిన అంశాలపై పిర్యాదులు అందాయి. సాలూరుకు చెందిన పి.కుమారి తన భర్త ఇటీవల మృతి చెందారని చంద్రన్న బీమా ద్వారా రావలసిన మొత్తం అందలేదని ఫిర్యాదు చేసింది. అరసాడ గ్రామానికి చెందిన డ్వాక్రా సంఘం& సాయిబాబా సంఘానికి పసుపు కుంకుమ పథకం అందలేదని ఫిర్యాదు చేసింది. జి.ఎం.వలస మండలం హౌసింగ్ అధికారిఅవినీతి అక్రమాలకు పాల్పడుతున్నాడని ఆ మండల మాజీ సర్పంచు, ఇతర ప్రజా ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. కొరుకొండకు చెందిన సిరిపురపు లక్ష్మీదేవి ఇల్లు మంజూరు చేయాలని ఇలా 54 ఫిర్యాదులు రాగా వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో జె.సి.-2 జె.సీతారామారావు, డిఆర్ఓ జె.వెంకటరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నవభారత్ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 11వ మెగా రక్తదాన శిబిరం



యలమంచిలి : యలమంచిలి కన్యకా పరమేశ్వరి మండపంలో నవభారత్ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సంఘం అద్యక్షులు సత్యం బంగారుశెట్టి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రక్తదాన శిబి రంలో 67 మంది రక్తదానం ఇచ్చారని తెలి పారు. అలాగే పలువురు యువకులు స్వచ్చం దంగా పాల్గొని రక్తదానం చేశారు. సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించిందని బంగారు శెట్టి అన్నారు. రక్తదానం చేసే వాళ్ళ స్వచ్చందంగా వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేసి నందుకు పేరుపేరునా ధన్య వాదాలు తెలిపారు. అదే విధంగా ఇప్పటి వరకు 11వ రక్తదాన శిబిరాన్ని నిర్వహించి నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నవ భారత్ యువజన సంక్షేమ సభ్యులు ఏ.ఎస్. రాజా, బ్లక్ బ్యాంక్ వైద్యులు డాక్టర్ సిరీస, శ్రీని వాసరావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# 18న అన్నమయ్య జయంతి వేడుకలు



విజయనగరం: స్థానిక గరజాడ కళాభారతిలో ఈనెల 18వ తేదీన సాయంత్రం 6 గంటలకు శ్రీవారి స్వచ్ఛంధ సేవాసంస్థ , ఘంటశాల స్మారక కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో తాళ్ళపాక అన్నమాచార్యుల వారి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామని కళాపీఠం వ్యవస్థాపకులుఎం.భీష్మారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆ వేదికపై భక్తుల సందర్శనార్థం 12 అడుగుల ఎత్తుగల శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. శ్రీభగవతి నృత్యకళామందిర్ కళాకారులతో అన్నమయ్య జననం నృత్యరూపకం ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఈ విగ్రహ సౌజన్య మూర్తి ఏగిరెడ్డి తిరుపతినాయుడు, జిల్లా కలెక్టర్ హరిజవహర్‌లాల్ సభాకార్యక్రమంలో పాల్గొంటారని పూజ్యశ్రీ సమతానందస్వామిజీ (శ్రీదుర్గాపీఠం) వారికి సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. నాటి కార్యక్రమంలో ఆదిభట్ల శ్రీకళాపీఠం వ్యవస్థాపకులు, సినీనటి పడాల కళ్యాని పాల్గొంటారని తెలిపారు. విలేఖరుల సమావేశంలో సంస్థ సహాయకార్యదర్శి బి.సూర్యనారాయణ, హరి, గుప్తా, కార్యదర్శి వై.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# భారత్ వికాస్ పరిషత్ నూతన కార్యవర్గం

## -నగర శాఖ అధ్యక్షులుగా శేఖరమంత్రి ప్రభాకర్



విశాఖపట్నం : భారత్ వికాస్ పరిషత్ విశాఖ నగరశాఖ నూతన కార్యవర్గాన్ని 2019-2020 గానూ ఎన్నుకోవడం జరిగిందని బి.వి.పి. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.వి. రాజశేఖర్ పత్రికా ప్రచురణార్థం తెలిపారు. భారత్ వికాస్ పరిషత్ విశాఖ నగరశాఖ అధ్యక్షునిగా ప్రముఖ రచయిత, కవి శేఖరమంత్రి ప్రభాకర్ ఎన్నికైనారు. వీరితోపాటు ఉపాధ్యక్షులుగా ఎం.ఎస్.ఎల్. శైలజ, పి.ఎల్.కె.మూర్తి, కార్యదర్శిగా సమయమంతుల సోమరాజు, కోశాధి కారిగా పేర్ల భాస్కరరావు, మీడియా ఇన్‌చార్జ్ మరియు పి.ఆర్. ఓ.గా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజ శేఖరులు ఎన్నికైనారు. వీరు 2019 మే నుండి 2020 ఏప్రిల్ వరకు నగర శాఖ ద్వారా అనేక సేవా కార్య క్రమాలు విద్యార్థుల కోసం, దివ్యాంగుల కోసం నిర్వహిస్తారు. భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర శాఖ నిర్వహించే కార్యక్రమాలలో కూడా నగర శాఖ తరుపున పాల్గొంటారు.


# అదరగొట్టిన లిటిల్ ఐకాన్స్



విశాఖపట్నం: మద్దిల పాలెం సిఎంఆర్ సెంట్రల్ ప్రాంగణంలో ఆది వారం సాయంత్రం మ్యాక్స్ లిటిల్ ఐకాన్-2019 లిటిల్ ఛాంప్స్ పేరిట ఫినాలే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 24 మంది నృత్యాలు, 13 మంది గీతాల పోటీల్లో పాల్గొన్నారు. చిన్నారులు ఫ్యాషన్‌షో, ర్యాంప్ వాక్‌లు చేసి సందడి చేశారు.

ఈ కార్యక్రమంలో కొరియోగ్రాఫర్ రంజన్ నాయక్, సుపరిచిత గాయని కె.నిఖితా శ్రీవల్లిలు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

# అలయన్స్‌క్లబ్ ఐసిసి ఛైర్మన్‌గా గురుప్రసాద్



విజయనగరం: అలయన్స్‌క్లబ్స్ ఇంటర్నేషనల్ ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలను పురస్కరించుకుని క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షులు డాక్టర్ అశ్వినీ కుమార్ గుప్తా విజయనగరంకు చెందిన సముద్రాల గురుప్రసాద్‌కు క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ ఛైర్మన్‌గా (ఐసిసి) నియమించారు. ఈ సందర్భంగా గురాన అప్పలనరసమ్మ, క్లబ్ గవర్నర్ గురాన అయ్యలు, వైస్ గవర్నర్ పిన్నింటి సూర్యనారాయణ, పూర్వ గవర్నర్ పెనుమజ్జి విజయలక్ష్మి, రీజనల్ ఛైర్‌పర్సన్ గోటేటి హిమబిందు, జోన్ ఛైర్‌పర్సన్ ఎం సుభద్రాదేవి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

మొదటి పేజీ తరువాయి

## ఒడిశాకు సాయం.. ప్రధాని ఏరియల్ సర్వే

ప్రభుత్వం జారీ చేసిన హెచ్చరికలకు ఒడిశా ప్రజలు స్పందించిన తీరును ఆయన అభినందించారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో కలిసి పనిచేశాయన్నారు. తుపాను నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, సీఎం నవీన్ పట్నాయక్ చేపట్టిన కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. సహాయ కార్యక్రమాల్లో కేంద్ర ప్రభుత్వం మద్దతుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమానికి అండగా ఉంటామని తెలిపారు. త్వరలోనే కేంద్ర ప్రభుత్వ తరపున నిపుణుల బృందం రాష్ట్రంలో పర్యటించి జరిగిన నష్టాన్ని అంచనా వేస్తుందని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి విపత్తులను ఎదుర్కోవడానికి రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి సమగ్ర కార్యాచరణను రూపొందిస్తామన్నారు. మరోవైపు ఈ తుపాను ధాటికి మృతి చెందిన వారి సంఖ్య 34కి చేరింది.

ఫొని తుపాను ధాటికి ఒడిశాలోని పూరీ, ఖుర్దా, నయాగఢ్, కేంద్రపడ జిల్లాలు తీవ్రంగా ప్రభావితమైన విషయం తెలిసిందే. కటక్, గంజాం, జగత్సింగ్‌పూర్, బాలేశ్వర్, భద్రక్ జిల్లాల్లో పాక్షిక ప్రభావం కనిపించింది. ఈ తుపాను ధాటికి పూరీ జిల్లాలో విద్యుత్తు, రవాణా వ్యవస్థలు పూర్తిగా స్తంభించించిపోయాయి. అలాగే తీర ప్రాంత జిల్లాలు జలదిగ్బంధంలో చిక్కుకొన్నాయి. ఒడిశాలోని పలు జిల్లాల్లో ఆరు లక్షల హెక్టార్లల్లో వరి, కూరగాయల పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

## పెండింగ్ కోర్టు కేసులపై శ్రద్ధ వహించాలి

గ్రీవెన్స్ పిటిషన్ ను సంబందిత అధికారి ప్రత్యేకంగా పరిశీలించి ఆన్ లైన్ లో దాని పరిష్కార వివరాలను పొందుపరచాలన్నారు. సమస్యలకు స్పష్టమైన పరిష్కారం చూడకుండా తిరస్కరించడం సరికాదన్నారు. ఇ - ఆఫీసు నిర్వహణ పై సమీక్షిస్తూ పలు శాఖలు ఇంకా ఈ పద్ధతిలో ఫైళ్లను నిర్వహించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలక్టరు మాట్లాడుతూ ప్రతి కార్యాలయంలో కనీసం ఒక కంప్యూటర్, ఇంటర్నెట్ సదుపాయాలు తప్పనిసరిగా ఏర్పాటుగావించాలని ఆదేశించారు.

తదుపరి కలక్టరు వివిధ శాఖలలో పెండింగ్ కోర్టు కేసులపై సమీక్షిస్తూ ప్రతి అధికారి వారి శాఖలో కోర్టు కేసులకు కౌంటర్ ఫైల్ చేసి ప్రబ్లిక్ ప్రాసిక్యూటర్ తో అప్రూవ్ గావించుకుని సిద్ధం చేసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీమతి జి.సృజన, ఎజెసి వెంకటేశ్వర్లు, డిఆర్ఒ గున్నయ్య, పిడి డిఆర్.డిఎ, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ శివారులో అగ్నిప్రమాదం

వాహనాలను కూడా అక్కడే పార్క్ చేస్తారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో 108 వాహనాలకు మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో సుమారు 60 వాహనాలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనకు షాట్ సర్క్యూట్ కారణంగా పోలీసులు చెబుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ముగిసిన ఐదో దశ పోలింగ్

ఐదో దశలో అత్యల్ప స్థానాలకు (51) పోలింగ్ జరిగింది. ఈ నియోజకవర్గాల నుంచి 674 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటివరకు మొత్తం 424 నియోజకవర్గాలకు ఎన్నికలు ముగిశాయి. మిగిలిన 118 స్థానాలకు ఆరు, ఏడు దశల్లో పోలింగ్ జరుగుతుంది. కాగా, ఆరోదశ ఎన్నికలు మే 12న, ఏడోదశ ఎన్నికలు మే 19న జరగనున్నాయి. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మే 23న వెల్లడవుతాయి. సాయంత్రం 5 గంటల వరకు వెల్లడైన ఓట్ల శాతం మొత్తం కలిపి 52.08గా ఉంది. బిహార్‌లో 48.12, జమ్ముకశ్మీర్‌లో 15.51, మధ్యప్రదేశ్‌లో 54.39, రాజస్థాన్ 51.99, ఉత్తర్‌ప్రదేశ్ 45.87, పశ్చిమ బెంగాల్ 65.01, ఝార్ఖండ్ 58.07గా నమోదైంది.

# మిలీషియా సభ్యులు లొంగిపోయారు

## ఎస్పీ అట్టాడ బాబూజీ




విశాఖపట్నంః విశాఖ జిల్లా ఏజెన్సీలోని సీపిఐ మావోయిస్టు పార్టీకి చెందిన పెదబయలు ఏరియా దళసభ్యులు ఇద్దరు, నలుగురు మిలీషియా సభ్యులు జిల్లా ఎస్పీ అట్టాడ బాబూజీ ముందు లొంగిపోయారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ వివరాలను వెల్లడించారు. గొల్లూరు బిరుసు అలియాస్ మహేష్ (24), గొల్లూరు రామయ్య, అలియాస్ రాహుల్ అలియాస్ యోగి (25), కొర్రా సత్తిబాబు (37), గొల్లూరి సత్యన్నారాయణ (18), కొర్రా గణపతి (40), కొర్రా పాత్రో (19) ఉన్నారు. అయితే గొల్లూరు బిరుసు, గొల్లూరు రామయ్యలపై ఒక్కొక్కరిపై లక్ష రూపాయలు రివార్డు కూడా ఉందని ఎస్పీ తెలియజేశారు. మావోయిస్టు వ్యవహారాలు నచ్చకే జనజీవన శ్రవంతిలో కలిసిపోవాలనే ఉద్దేశ్యంతో వీరు లొంగిపోయారన్నారు. ప్రభుత్వం పరంగా మన్యంలోని అభివృద్ధి కార్యక్రమాలు జరగాలని, గిరిజనులకు మంచి జరగాలనే ఉద్యేశ్యంతో వీరి లొంగుబాట్లు జరిగాయి తప్పా ఈ విషయంలో ఎవరినీ ఎలాంటి చిత్ర హింసలకు గురిచేయలేదని ఎస్పీ వివరించారు. వారంతట వారిగానే పోలీసుల ఎదుట లొంగిపోయారన్నారు. ప్రభుత్వం ద్వారా పోలీసులు చేపడుతున్న గిరిజన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి, ఉపాధి శిక్షణ కార్యక్రమాలకు ఆకర్షితులై వీరంతా జనజీవన స్రవంతిలో కలవాలనుకునే ఇక్కడి వచ్చారని చెప్పారు. విశాఖ మన్యంలో ప్రతీ ఆరు నెలలకి ఒకసారి, మూడు నెలలకి ఒకసారి మిలీషియా సభ్యుల లొంగుబాటు చూపిస్తున్న జిల్లా పోలీసులు మావోయిస్టు పార్టీ తుడిచిపెట్టుకుపోయిందని చెప్పిన ప్రచారం తేడా ఏంటని ప్రశ్నించగా చత్తీస్ ఘడ్ నుంచి కొత్త దళ సభ్యులు విశాఖ జిల్లా మన్యంలోకి వస్తున్నారని వివరించారు. అదేవిధంగా చాలా మంది మావోయిస్టులు లొంగిపోతున్నా అదే సమయంలో కొత్తవారు కూడా వస్తున్నట్టు వివరించారు. గత రెండు రోజుల క్రితం గూడెం కొత్తవీది మండలం ఆర్వీ నగర్ సంతలో కొందరు గిరిజనులను మావోయిస్టుల వివరాలు చెప్పాలంటూ పోలీసులు చిత్ర హింశలు చేశారనే విషయంపైనా ఎస్పీ సరైన సమాధానం చెప్పలేదు. అలాంటి సంఘటనలు ఏమీ జరగలేదనే చెప్పుకొచ్చారు. లొంగిపోయిన మిలీషియా సభ్యులకు ప్రభుత్వ పరంగా చేయాల్సి ఉపాది కార్యక్రమాలు చేపడతామని ఎస్పీ అట్టాడ బాబూజీ మీడియాకి వివరించారు.

# ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను ఎటువంటి సమస్యలు లేకుండ నిర్వహించాలి

విశాఖపట్నం: ఈ నెల 14 వ తేది నుండి 22వ తేది వరకు నిర్వహించ నున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను ఎటువంటి సమస్యలకు తావు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.భాస్కర్ సంబందిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలక్టర్ ఈ పరీక్షల నిర్వహణ, ఏర్పాట్ల పై మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మొత్తం 70 పరీక్షా కేంద్రాలలో ( థియరీ మరియు ప్రాక్టికల్) నిర్వహించబడతాయని, ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, జెరాక్స్ సెంటర్లను మూసివేయాలని ,మంచినీటి సదుపాయం, ఆశావర్కర్లు అందుబాటులో ఉండాలన్నారు. పరీక్షలు ఉదయం 9.00 గంటలనుండి 12.00 గంటల వరకు, మద్యాహ్నం 2.00 నుండి సాయంత్రం 5.00 గంటలవరకు జరుగనున్నందున పరీక్షా కేంద్రాల వద్ద విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా తగు చర్యలు చేపట్టాలని ఎపి ట్రాన్స్ కో అధికారులను ఆదేశించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు గావించి మాల్ ప్రాక్టీస్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ పరీక్షల నిర్వహణకు జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.గున్నయ్య కో ఆర్డినేటింగ్ అధికారిగా వ్యవహరిస్తారని తెలియజేశారు.

ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ .ఐ.ఒ టి.నగేష్ కుమార్, డిఇఒ లింగేశ్వరరెడ్డి, నగరపాలక సంస్థ, ఎపిట్రాన్స్‌కో, పోలీస్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 11న జెపి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం

**స్థానిక ఎన్నికలు ప్రత్యక్ష పద్ధతిలో జరగాలి**

**లోక్ సత్తా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బీసెట్టి బాబ్జి డిమాండ్**



డాబాగార్డెన్స్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక ప్రభుత్వాల ఎన్నికలు ప్రత్యక్ష పద్ధతిలోనే నిర్వహించాలని కోరుతూ ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం కోసం ఈనెల 11న ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో లోక్సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్. జయప్రకాష్ నారాయణ అధ్యక్షతన వివిధ రాజకీయ పార్టీల ప్రజా సంఘాల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు లోక్ సత్తా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బీశెట్టి బాబ్జి తెలిపారు. సోమవారం ఉదయం పౌర గ్రంథాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వాల ఎన్నికలు పరోక్ష పద్ధతిలో జరగడం వలన రాజకీయ పార్టీలు అడ్డదారిలో అధికారం అందిపుచ్చుకొననే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ప్రత్యక్ష పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు .ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నుంచి ప్రతినిధులు వస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లోక్ సత్తా పార్టీ నాయకులు వేణు గోపాల్, హరి గణేష్ ,రాజేశ్వరి, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని వినతి



నాతవరం: మండలంలోని మాధవనగరం శివారు గ్రామం గంటావాని కొత్తగూడెంలో పిచ్చికుక్కల దాడిలో 13 గేదెలు, 2 ఆవులు, మూడేళ్ల బాలుడు మృతి చెందాడని, దీనిపై చర్యలు తీసుకోవాలని మాధవనగరం మాజీ సర్పంచ్ సోముల చినతల్లి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ రజాక్ గ్రామస్థులు సోమవారం నాతవరం ఎంపిడిఓ రోజారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుక్కల దాడికి గురై బాలుడు, పశువులు మృతి చెందినప్పటికీ కుక్కల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. వెంటనే స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

# 9న ఆదిశంకరాచార్య జయంతి

రావికమతం: ఈ నెల 9న ఆదిజగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి, 29న హనుమాన్ జయంతి కార్యక్రమాలను వేడుకగా నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ జి.సత్యారావు తెలిపారు. ఈ నెల 16 నుంచి 25 వరకు ఇంటింటా ప్రచారం చేసి 29న జరగబోయే హనుమాన్ జయంతి కార్యక్రమంలో అందరూ హాజరయ్యేలా చేయాలని నిర్ణయించామన్నారు. ఈ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

# ఏపీకి జీవనాడి పోలవరం

- ఇప్పటికి 90 సార్లు సమీక్షించా
- ముమ్మరంగా సాగుతున్న స్పిల్‌వే పనులు
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

పోలవరం : పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం తొలిసారిగా పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు సందర్శించారు.

పనుల పురోగతిని పరిశీలించారు. అధికారులతో సమీక్షించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. స్పిల్‌వే పనులు ముమ్మరంగా సాగుతున్నాయని వివరించారు.

పోలవరం ప్రాజెక్టు పనులు 70.17 శాతం పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టుపై ఇప్పటి వరకూ 90 సార్లు సమీక్షలు జరిపాను. 30 సార్లు క్షేత్రస్థాయిలో పర్యటించాను. ఈ ప్రాజెక్టు ద్వారా 40 లక్షల ఎకరాలకు సాగునీరు, 980 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అవకాశం ఉంటుంది.

ప్రాజెక్టులో మొత్తం 48 గేట్లు ఉండగా.. 30 లక్షల క్యూసెక్కులు వదిలేలా వీటి నిర్మాణం జరుగుతోంది. ప్రాజెక్టు కోసం రూ.16,493 కోట్లు ఖర్చుపెట్టాం. కేంద్రం రూ.6,727 కోట్లు ఇచ్చింది. ఇంకా రూ.4,631 కోట్లు రావాల్సి ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే కరవును జయించవచ్చు.

1941 నుంచి పోలవరంపై నేతలు ఎన్నికల సమయంలో మాట్లాడుతూనే ఉన్నారు అని చంద్రబాబు తెలిపారు.

# కేజిబివిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రోలుగుంట: మండల కేంద్రంలోని కేజిబివిలో ఆరో తరగతిలో ప్రవేశానికి బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఇన్‌చార్జ్ ఎఒ పూర్ణిమ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులను అనుమతించమని చెప్పారు. బడి బయట, బడి మానేసిన తల్లిదండ్రులు లేనివారు, దివ్యాంగులు, విద్యాలయంలో చేరేందుకు అర్హులని చెప్పారు. ఆసక్తి గల వారు ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# పురసేవ యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి

నర్సీపట్నం : పురసేవ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని ప్రభుత్వ పథకాలను ఇంటి వద్ద నుండే పొందవచ్చునని సంకల్ప సేవా సొసైటీ డిసి వి.కృష్ణ పేర్కొన్నారు. సోమవారం నర్సీపట్నం మున్సిపాలిటీలోని 16వ వార్డులో పలువురికి అవగాహన కల్పించి స్వయంగా సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసి పురసేవ యాప్ ఎలా ఉపయోగించాలో తెలియజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నట్లు అయితే ప్రభుత్వానికి సంబంధించిన అన్ని సేవలు ఇంటి వద్ద నుంచే పొందవచ్చునన్నారు.

ఆండ్రాయిడ్ మొబైల్ ఉన్న వారు పురసేవ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని మీ ఇంటి వద్ద నుంచి ఇంటి పన్నులు, కరెంట్ బిల్లులు కట్టకోవచ్చునన్నారు. అదే విధంగా వాటర్ ట్యాక్స్‌లు, ఖాళీ స్థలాల వివరాలు తెలుసుకోవచ్చునన్నారు. వార్డులో నీటి సమస్య, పారిశుద్య సమస్య ఏమి వచ్చినా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే తక్షణమే సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉందన్నారు. కావున అందరు పురసేవ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు.

# ఉత్తరాంధ్ర అభివృద్ధిలో జర్నలిస్టులు కీలకపాత్ర పోషించాలి

**యుజెఎఫ్ డైరీ ఆవిష్కరణ, జర్నలిస్టు సత్యనారాయణకు సన్మానం**



నర్సీపట్నం: ఉత్తరాంధ్ర అభివృద్ధిలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలని యుజెఎఫ్ అధ్యక్షులు ఎంఆర్ఎన్.వర్మ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక నవనిర్మాణ సమితి భవనంలో యుజెఎఫ్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో 97లక్షల మంది ప్రజల బాగోగులపై ప్రభుత్వాలు, నాయకులు వివక్ష చూపుతున్నారన్నారు. ఢిల్లీలోనూ విజయవాడలో యుజెఎఫ్‌కి అభిమాన మిత్రులున్నారన్నారు. 114 మండలాలు, 10 రెవెన్యూ డివిజన్లలో భవిష్యత్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తా మన్నారు. స్థానిక సమస్యలపైనా నీటి లభ్యత, కార్మికుల వలస, కార్మిక భద్రత తదితర విషయాలపై నాయకులపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక విలేకరి సత్యనారాయణకు పూలమాలలు వేసి, దుశాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డిసిహెచ్.రాజుబాబు, అంగన్వాడీ అసోసియేషన్(ఏఐటియుసి) జిల్లా అధ్యక్షులు ఎం.అప్పలరాజు, యుజెఎఫ్ నాయకులు రాము, సత్యనారాయణ, చింతపల్లి నుండి కాశింవల్లి అధ్యక్షత వహించగా శంకర్ కార్యక్రమం నిర్వహణకు బాధ్యత వహించారు.

# ఫుడ్ బాస్కెట్‌ల కోసం గిరిజనులు ఎదురు చూపు


గొలుగొండ: ఆహార భద్రత పథకంలో భాగంగా గిరిజనులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సరఫరా చేసిన ఫుడ్ బాస్కెట్ సరుకులు డిపోల్లో పడి ఉన్నాయి. వీటి పంపిణీకి ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారడంతో ముక్కిపోతున్నాయి. మండలంలో ఉన్న 38 రేషన్ డిపోల ద్వారా సుమారు 1500 తెల్ల కార్డుల గల గిరిజనులకు వీటిని అందించేందుకు మార్చిలో అధికారులు సరఫరా చేశారు. ఆకలితో అలమటిస్తున్న గిరిజనులకు వీటిని అందించి తద్వారా ఆదుకోవాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో ఆరు రకాల సరుకులు ఉన్నాయి. వేరుశెనగ పలుకులు, చోడిపిండి, కందిపప్పు, బెల్లం, నూనె, ఉప్పు వంటి సరుకులతో కూడిన బాస్కెట్ కోసం గిరిజనులు ఎదురు చూస్తున్నారు. తమలాంటి నిరుపేదలకు ఆదుకోవడానికి కూడా అధికారులు ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపడం తగదని పేర్కొంటున్నారు. సరుకులు పాడైన తర్వాత ఇచ్చినా ప్రయోజనం ఏమిటని మరికొంత మంది ప్రశ్నిస్తున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి సరుకులు తమకు పంపిణీ చేసేల చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## 10నుంచి ఎర్రగొండమ్మ జాతర

కొయ్యూరు: నల్లగొండ శరభన్నపాలెం గ్రామాల మధ్య కొలువుదీరిన ఎర్రగొండమ్మ తల్లి జాతర ఈ నెల 10 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. వేసవి నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.జాతర సందర్భంగా ఈ నెల 6 నుంచి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు డేంజరస్ డార్లింగ్ యూత్ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. వివరాలకు 9492325622, 9441673722కు సంప్రదించాలన్నారు.

# ఆరోగ్య ప్రదాయిని హలీం

- ముస్లింలకు ఉపవాసదీక్షలో ఆరోగ్యం
- కులమత బేధాలకతీతులై అందరూ స్వీకరిస్తారు
- హలీం సెంటర్ నిర్వాహకుడు జుబేర్
- ముఖ్య అతిథి వైకాపా నేత ద్రోణంరాజు శ్రీనివాసరావు



విశాఖ సిటీ: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కావటంతో నగరంలో హలీం సెంటర్లు ప్రారంభమవుతున్నాయి. జగదాంబ సెంటర్, దండు బజార్ వద్ద హలిం సెంటర్ నిర్వాహకుడు జుబేర్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా హలీం సెంటర్ ఏర్పాటు చేస్తుండటం అందరికీ విదితమే. ఈ సంవత్సరం కూడా ఏర్పాటు చేసిన హలీం సెంటర్‌ను వైకాపా నేత ద్రోణంరాజు శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలకు ఉపవాసదీక్షలో ఆరోగ్యాన్ని ఇచ్చే విధంగా హలీం ఎంతో ఉపయోగకరం అన్నారు. కులమత బేధాలు తావు లేకుండా ఈ మాసంలో హలీం ను అందరూ ఆస్వాదిస్తూ ఉండటం ఎంతో ఆనందదాయకమన్నారు. నిర్వాహకుడు జుబేర్ మాట్లాడుతూ హలీం తయారీలో ఆరోగ్యకర మూలికలను, దినుసులను వాడుతున్నట్లు పేర్కొన్నారు. ఎంతో ఆరోగ్యాన్ని ఇచ్చే హలీంను ప్రజలందరూ ఆస్వాదించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. అతి తక్కువ ధరలోనే తమ సెంటర్లో మటన్, చికెన్ హలీమ్ లతోపాటు చక్కటి బిర్యానీ వంటకాలను కూడా అందరికీ అందుబాటులో ఉండేటట్లుగా అందిస్తున్నామ న్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నేతలు ఫారూకి, జాన్ వెస్లీ, కే కే రాజు తదితరులు పాల్గొని హలీమ్ రుచిని ఆస్వాదించారు.

# పంపిణీకి సిద్ధంగా పచ్చిరొట్ట విత్తనాలు

కొయ్యూరు: మండల రైతాంగానికి 70శాతం రాయితీపై పంపిణీ చేసే పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నట్టు మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి తెలిపారు. ఇందులో భాగంగా జనుము కిలో రూ.59-80 అసలు ధర కాగా ప్రస్తుతం రూ.42-35 రాయితీ ఇస్తుందన్నారు. అలాగే జీలుగు కిలో రూ.52-80 కాగా ప్రభుత్వం రాయితీ రూ.39-60 పోను రైతు చెల్లించాల్సిందిగా రూ.13-20 అని, పిల్లిపెసర విత్తనాలు కిలో రూ.106 కాగా ప్రభుత్వ రాయితీ, 79-50 ఇస్తునందున రైతు రూ.26-05 చెల్లించాలన్నారు. ఈ మేరకు జీలుగు 30 కిలోల ప్యాకెట్లు 63, జనుము 40 కిలోల ప్యాకెట్లు 60, పిల్లి పెసర 20 కిలోల ప్యాకెట్లు 10 పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ విత్తనాలు కావల్సిన రైతులు భూమి పట్టా, ఆధార్ జెరాక్స్ కాపీలతో పాటు రైతు గానీ, అతని కుటుంబీకులు గానీ వచ్చి బయో మెట్రిక్ విధానం ద్వారా విత్తనాలు పొందవచ్చునని ఏఒ తెలిపారు.


# చోరీలపై అప్రమత్తం కావాలి

యలమంచిలి రూరల్: వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు పట్టణంలోని పోలీసులు ఆటోపై మైక్ ఏర్పాటు చేసిన ప్రచారం చేశారు. మీ పరిసర ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు గమనించినా, అనుమానిత వ్యక్తులు సంచరించినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. రాత్రి సమయాల్లో అపరిచిత వ్యక్తులు ఉన్నట్లు కనిపించినా ఇంటి తలుపులు కొట్టినా జాగ్రత్త వహించాలని సూచిస్తున్నారు. మేడ మీద పడుకున్న వారు కూడా ఎప్పటికప్పుడు తాళాలు సక్రమంగా ఉన్నాయో లేవో పరిశీలించుకోవాలన్నారు. పోలీసులకు ప్రజలు సహకరించాలన్నారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లోనూ మైక్ ద్వారా ప్రచారం చేశారు.

# జివిఎంసి గ్రీవెన్సుకు 118 పిర్యాదులు

విశాఖపట్నం : జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్సుడేలో మొత్తం 118 ఫిర్యాదులు అందాయి. జివియంసి అదనపు కమిషనర్ (జనరల్) జివివియస్ మూర్తి ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరిస్తూ వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అందిన మొత్తం 118 పిర్యాదులలో ప్రధాన కార్యాలయానికి సంబంధించి 38 ఫిర్యాదులు అందాయి. ఒకటవ జోన్‌కు సంబంధించి 15, నాలుగవ జోన్‌కు సంబంధించి 7, ఐదవ జోన్‌కు సంబంధించి 51, ఆరవ జోన్‌కు సంబంధించి 7 ఫిర్యాదులందాయి. వీటిలో టౌన్‌ప్లానింగ్ విభాగంకు సంబంధించి 30, ప్రజారోగ్యవిభాగానికి సంబంధించి 10, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 39, ఇ.ఇ (పి ఎల్ అండ్ సి) విభాగంకు సంబంధించి ఒకటి, అదనపు కమిషనర్ (ఫైనాన్స్) విభాగానికి సంబంధించి 3, డిప్యూటి కమిషనర్ రెవిన్యూ విభాగంకు 16, యుసిడి విభాగానికి సంబంధించి 5, ఇతరులకు సంబంధించి 17 పిర్యాదులు అందాయి.

# డయల్ యువర్ కమిషనర్‌కు 10 ఫిర్యాదులు



విశాఖపట్నం : జి.వి.యం.సి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ (నెంబరు 1800-4250-0009) కార్యక్రమానికి 10 ఫిర్యాదులు అందాయి. ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వై.మంగపతిరావు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి హాజరై పలువురి నుండి వచ్చిన ఫోన్ కాల్స్‌కు సమాధానం చెప్పారు.

ఇందులో రెండవ జోన్‌కు సంబంధించి ఒకటి, నాలుగవ జోన్‌కు సంబంధించి రెండు, ఐదవ జోన్‌కు సంబంధించి ఒకటి, ఆరవ జోన్‌కు సంబంధించి నాలుగు, అనకాపల్లి జోన్‌కు సంబంధించి రెండు ఫిర్యాదులు అందాయి. సంబంధిత అధికారులు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి మూడురోజులులోగా నివేదిక సమర్పించాలని కోరారు.

# గిరిజనులకు వారి భూములను అప్పగించాలి



అనంతగిరి : అనంతగిరి మండలంలోని నాన్ షెడ్యూల్ ఏరియాలో గల, ఎన్.ఆర్.పురం, రొంపల్లి, పంచాయతీలో గల చిన కోనెల, బూరుగు, బొంగుజ, గ్రామాల్లో గిరిజనుల భూములను రెవెన్యూ చట్టాలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్‌లు చేసుకున్నారని, వాటిని రద్దు చేసి, వారి భూములను గిరిజనులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. గిరిజనులను మోసం చేసిన వ్యక్తులపై sc st అట్రాసిటీ కేసులు పెట్టాలని, సమగ్ర విచారణ చేయాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు సురేంద్ర, జిల్లా నాయకులు గోవింద, గంగరాజు, మోసియా, సింగులు, ఈ కార్యక్రమంలో రొంపల్లి, ఎం ఆర్ పురం, పంచాయతీల నుంచి పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

# 9 నుంచి గీతం ఇంజనీరింగ్ అడ్మిషన్ కౌన్సిలింగ్

సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ (బి.టెక్, ఎమ్.టెక్), ఫార్మశీ (బి.ఫార్మశీ, ఎమ్.ఫార్మశీ), ఆర్కిటెక్చర్ (బి.ఆర్క్, ఎమ్.ఆర్క్ ) కోర్సులలో ప్రవేశానికి గాను మే 9నుంచి 11తేదీ వరకు మొదటి విడత అడ్మిషన్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని అడ్మిషన్ల డైరక్టర్ ప్రొఫెసర్ కె.నరేంద్ర తెలిపారు.ఈ ఏడాది దేశ వ్యాప్తంగా 50 పట్టణాలలో నిర్వహించిన అఖిల భారత స్థాయి గీతం ప్రవేశ పరీక్ష (గ్యాట్-2019 ) గీతం ప్రవేశపరీక్షలో విద్యార్థులకు లభించిన ర్యాంక్ ఆధారంగా ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ పట్నం, విజయవాడ, తిరుపతి పట్టణాల్లో తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ లోనూ, కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో ఆన్‌లైన్ విధానంలో అడ్మిషన్ కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఏఐసిటిఇ (ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్), ఫార్మశీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా , కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ సంస్థల అనుమతితో విశాఖ, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలలో ఇంజనీరింగ్, ఫార్మశీ, ఆర్కిటెక్చర్ కోర్సులకు ఈ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తోందని తెలిపారు. ఈ ఏడాది నుంచి ప్రతిభగల విద్యార్థులను పెద్దఎత్తున ప్రోత్సహించడానికి రూ.30 కోట్ల మేర స్కాలర్‌షిప్‌లు మరియు ఫీజు రాయితీలను విశ్వవిద్యాలయం అందించనున్నదని ఆయన తెలిపారు. గీతం ప్రవేశ పరీక్షతో పాటు జెఈఈ మెయిన్ పరీక్షలో ఆంధ్రా, తెలంగాణా ఎంసెట్‌లలో టాప్ ర్యాంకర్లకు నాలుగేళ్ళ పాటు ఉచిత విద్య అందిస్తామన్నారు. అలాగే బి.టెక్ లోని కోర్ ఇంజనీరింగ్ కోర్సులలో విద్యార్థుల చేరికను ప్రోత్సహించడానికి సివిల్, మెకానికల్, ఇఇఇ కోర్సులతో పాటు బయోటెక్నాలజీ కోర్సులో ప్రవేశం పొందే విద్యార్థులకు ప్రత్యేకంగా ఏడాదికి రూ. 50వేల రుపాయల స్కాలర్‌షిప్‌ను ఫీజులో రాయితీగా అందించనున్నట్లు ఆయన వెల్లడించారు.

గీతం ప్రవేశ పరీక్షలో ర్యాంకు సాధించిన విద్యార్థులకు ఇప్పటికే సమాచారం పంపించామని, ఇతర వివరాలకు గీతం అడ్మిషన్ల కార్యాలయాన్ని సంప్రదించాల్సిందిగా సూచించారు.


RELIANCE డబ్బు

**రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్**

బ్రాంచ్ ఆఫీసు: మాలిక్ ఎస్టేట్స్, 6-3-344, జెవై రావు పార్కు ఎదురుగా, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500034, కార్పొరేట్ & రిజిష్టరు ఆఫీసు: రిలయన్స్ సెంటర్, 6వ అంతస్తు, సౌత్‌వింగ్, శాంత్రాక్రజ్ (ఈస్ట్) ముంబాయ్ - 400055

**డిమాండ్ నోటీసు**

క్రింద పేర్కొన్న రుణ గ్రహీతలు/సహరుణ గ్రహీతలు/తాకట్టుదారులు రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుంచి ఆర్థిక సాయం పొందియున్నారు. మేము తెలియచేయునది ఏమనగా ఆర్థిక సాయం మా నుంచి పొందినప్పటికీ సదరు రుణ గ్రహీతలు/సహరుణ గ్రహీతలు/తాకట్టుదారులు గడువు తేదీల ప్రకారం చెల్లించాల్సిన వడ్డీ మరియు మూలధనమును తిరిగి చెల్లించడంలో పలు తప్పిదములు చేసినారు. ఖాతాను సదరు తేదీలలో నాన్ పర్‌ఫార్మింగ్ అస్సెట్‌గా నేషనల్ హౌసింగ్ బ్యాంకు ద్వారా జారీ కాబడిన వర్గీకరించి, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి నిర్ణయం, సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యొక్క సెక్యూరిటీజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ క్రింద & సెక్షన్ 13(2) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ యొక్క రూల్ 3తో వర్తించు దాని క్రింద అధికారముతో ఎస్ఎఆర్ఎఫ్ఎ ఇఎస్ఐ చట్టం, 2002 యొక్క సెక్షను 13(2) క్రింద సదరు తేదీలలో క్రింద పేర్కొన్న రుణ గ్రహీతలు/సహరుణ గ్రహీతలు/తాకట్టుదారులుకు నోటీసులలో పేర్కొన్న విధంగా ఇన్సిడెంటల్ ఖర్చులు, కాస్ట్, ఛార్జీలు తదితరములు క్రింద పేర్కొన్న సొమ్మును నోటీసులు వారికి అందిన రోజు నుంచి 60 రోజులలోగా చెల్లించమని డిమాండ్ నోటీసులు వారికి పంపబడినవి. వారు చివరిసారిగా మాకు పేర్కొన్న చిరునామాలకు పంపిన సదరు నోటీసులు వారికి చేరకుండా మాకు తిరిగివచ్చినాయి. కావున ఈ విషయమును పబ్లిక్ నోటీసు ద్వారా తెలుపుతున్నాము.

| ఋణగ్రహీత(లు) సహా ఋణగ్రహీతల పేరు | ఎన్‌పిఎ తేది | డిమాండ్ నోటీసు తేది | ఔట్‌స్టాండింగ్ నగదు | లోన్ నగదు | సెక్యూర్డ్ అస్సెట్ల ప్రాపర్టీ చిరునామా |
|---|---|---|---|---|---|
| లోను అకౌంటు నెం. ఆర్ఎల్ఇ ఆర్విఐజెడ్000318283<br>1. మిసెస్ నవోదయ ఎడ్యుకేషనల్ సొసైటీ<br>2. తడెల జగన్నాథరావు (ట్రెజరర్)<br>3.పప్పుల లక్ష్మి (సెక్రటరీ)<br>4. గారాల సూర్యనారాయణ<br>5. పప్పుల ప్రభాకరరరావు<br>6. సోమేశ్వరరావు చింతలూరు<br>7. కృష్ణ మోహన్ వావిలాపల్లి<br>8. బొత్స లక్షున్నాయుడు<br>9. చింతలూరు శ్రీరామమూర్తి<br>10. గారాల లక్ష్మి<br>11. నావిలాపల్లి నాగమణి | 15/03/2019 | 20/03/2019 | రూ. 13,240,862.00/- (ఒక కోటి ముప్పై రెండు లక్షల నలభై వేల ఎనిమిది వందల అరవై రెండు రూపాయలు మాత్రమే | రూ. 1,65,00,000/- (ఒక కోటి అరవై ఐదు లక్షలు రూపాయలు మాత్రమే | భవనము, డోర్ నెం. 14-1325, సర్వే నెం. 13-6, 13-9, 13-11, సీతమ్మపేట రోడ్డు, నందివాడ కూర్మ రాజపురం గ్రామం, పాలకొండ నగర్ పంచాయితీ, పాలకొండ మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆర్ & బి బంగ్లా దగ్గర, నవోదయ నగరం, ఎ.పి.-532440 నుంచి 4115.20 చదరపు గజాల వరకు గ్రౌండ్‌పై రెండు అంతస్తుల యొక్క అణువణువు మరియు హద్దులు క్రింది విధంగా కలవు.<br>తూర్పు: డ్రెయిన్ & రోడ్డు<br>దక్షిణం: ఆర్ & బి బంగ్లా<br>పశ్చిమం: రోడ్డు<br>ఉత్తరం: రామచంద్రుడు ఆస్తి |

ఇట్టి పరిస్థితులలో పైన తెలిపిన విధంగా పైన పేర్కొన్న ఋణగ్రహీతలు, సహా రుణగ్రహీతలు, మరియు /లేదా వారి హామీదారులుకు (వర్తించుచోట) ఔట్‌స్టాండింగ్ డ్యూలు పైన తెలిపిన విధగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు చార్జీలతో నోటీసు పంపబడింది. 60 రోజులలోగా చెల్లించనచో తదుపరి రుణగ్రహీతలు మరియు తాకట్టుదారులు సెక్యూర్డ్ అస్సెట్లు సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క ఫైనాన్షియల్ అస్సెట్లు మరియు ఎన్‌ఫోర్స్‌మెంటు యొక్క సెక్యూరిటైజేషన్ మరియు రీ-కన్‌స్ట్రక్షన్ యొక్క సెక్షను 13(4) క్రింద మరియు తదుపరి వర్తించు చట్టాల క్రింద సెక్యూర్డ్ ఆస్తులు జప్తు చేయబడును.

పేర్కొనబడిన చట్టపు సెక్షను 13(13) క్రింద ఏ ఋణగ్రహీత కూడా నోటీసుల్లో తెలిపిన సెక్యూర్డ్ అస్సెట్లను సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క వ్రాతపూర్వక ఉత్తర్వులు లేకుండా సెక్యూర్డ్ అస్సెట్ల అమ్మకము, లీజు లేదా ఇతరములు జరపరాదని గమనించగలరు.

ప్రదేశం: వైజాగ్, తేది: 07 -05- 2019 సం/- (అధీకృత అధికారి), రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్

విజయభాను

## సంపాదకీయం

### ఆశ్చర్యకరంగా వ్యాఖ్యలు

ఉత్తరప్రదేశ్‌లో బీజేపీని దెబ్బకొట్టి, ప్రతిపక్ష కూటమికి తోడ్పడటమే తమ వ్యూహమని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక చేసిన వ్యాఖ్య సంచలనం సృష్టించడమే కాకుండా, ఎన్నికల అనంతర పరిస్థితికి రాజకీయపక్షాలు సిద్ధపడటాన్ని సూచిస్తున్నది. వీలైన చోట తమ అభ్యర్థులు గెలిచేవిధంగా లేకపోతే బీజేపీ ఓట్లు చీల్చి కూటమి అభ్యర్థులు గెలిచేవిధంగా వ్యవహరిస్తున్నట్టు ఆమె వెల్లడించారు. యూపీలో ఇప్పటివరకు నాలుగు విడతల్లో 39 స్థానాలకు పోలింగ్ జరిగింది. ఇంకా మూడు విడతల్లో పోలింగ్ జరుగవలసిన 41 స్థానాలు ప్రియాంక పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంతంలోనే ఉన్నాయి. సోనియా, రాహుల్ పోటీచేసే స్థానాలు ఉండటంతో పాటు, కాంగ్రెస్ అంతో ఇంతో గట్టి పోటీ ఇచ్చేది ఈ ప్రాంతంలోనే. ఇంత కీలకమైన ప్రాంతానికి పోలింగ్ ప్రారంభమయ్యే ముందు కాంగ్రెస్ నాయకత్వం చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యకరమైనవే. స్వభావరీత్యా ప్రియాంక ప్రత్యర్థులపై విరుచుకపడే రకం. 5వ విడుతలో పోలింగ్ జరిగే 14 స్థానాలలో విజృంభించి ప్రచారం చేయవలసిన ప్రియాంక యూపీలో బీజేపీకి బలమైన ప్రత్యర్థి మహా సంఘటన మాత్రమేననీ, కాంగ్రెస్ పార్టీ కాదని పరోక్షంగా అంగీకరించారు. ఎన్నికలు ప్రారంభమైనప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎస్పీ-బీఎస్పీ కూటమి పట్ల కఠినంగానే వ్యవహరించింది. సోనియా, రాహుల్‌కు పోటీ పెట్టనందుకు ప్రతిగా తాము కూడా నాలుగైదు స్థానాల్లో మహా సంఘటన అభ్యర్థులకు పోటీ పెట్టలేదు. ఈ మాత్రం సర్దుబాటు మినహా వీలైనన్ని చోట్ల కాంగ్రెస్ బలమైన అభ్యర్థులను నిలిపింది. ఈ క్రమంలో కొన్నిచోట్ల బీజేపీ, మరికొన్ని చోట్ల మహా సంఘటన అభ్యర్థుల ఓట్లను చీల్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. కానీ ఎన్నికల సమరం మధ్యకొచ్చేసరికి మహా సంఘటన ప్రాధాన్యాన్ని గుర్తించింది. ప్రియాంక సంచలన వ్యాఖ్యలు చేసిన మరుసటి రోజు రాహుల్‌గాంధీ కూడా తమ పార్టీకి బలమైన అభ్యర్థులు లేనిచోట ఎస్పీ-బీఎస్పీ కూటమికి తోడ్పడుతున్నట్టు చెప్పుకున్నారు. యూపీలో లౌకిక కూటమి గెలుస్తుందనేది స్పష్టమని కూడా ఆయన అన్నారు. మాయావతి, అఖిలేశ్ అంటే తనకు ఎంతో గౌరవమని, యూపీలో బీజేపీని ఓడించడమే తమ లక్ష్యమని అన్నారు. ఎన్నికలు ప్రారంభమైన నాటితో పోలి స్తే, ఆయన వైఖరిలో భారీ మార్పు కనిపిస్తున్నది. మోదీ మళ్ళా ప్రధాని కాబోరు, ఇది కచ్చితం అంటూనే నేను ప్రధానిని కావాలనుకుంటున్నానని లేదా కావాలనుకోవడం లేదని చెప్పలేనని అంటూ రాహుల్‌గాంధీ ఆచితూచి మాట్లాడారు. గతంలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భం గా- లోక్‌సభ ఎన్నికల అనంతరం తగినంత బలం ఉంటే ప్రధాని అవుతానని చెప్పడానికి ఇప్పటికీ ఎంతో తేడా ఉన్నది. బీజేపీ కూటమి మెజారిటీ తెచ్చుకోలేదనే సంకేతాలు కనిపిస్తున్న దశలో చేసిన వ్యాఖ్యలివి. అయితే కాంగ్రెస్ పార్టీ ఎన్ని సీట్లు తెచ్చుకోగలుగుతుందనేదే కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. తమకు మరీ తక్కువ స్థానాలు వస్తే, ఇతర లౌకిక పక్షాలకు మద్దతు ఇవ్వడానికి సిద్ధపడాలె. మిగతా రాజకీయపక్షాలకు తాము మద్దతు ఇస్తాననే సందేశం ఇచ్చినప్పుడే, అవసరమైతే తమకు మద్దతు ఇవ్వమని అడిగే అవకాశం ఉంటుంది. యూపీలోని 80 స్థానాలలో 2014 ఎన్నికలలో బీజేపీ 71 స్థానాలు గెలుచుకున్నాయి. మరో రెండు స్థానాలలో బీజేపీ మద్దతుతో అప్నాదళ్ గెలిచింది. అంటే గత ఎన్నికల్లో బీజేపీకి లభించిన 281 స్థానాలలో 71 యూపీ నుంచే లభించాయి. ప్రియాంకను రంగంలోకి దింపి మహాసంఘటనను ఇరకాటంలో పెట్టాలనుకున్న రాహుల్ నాలుగు విడుతల పోలింగ్ ముగిసిన తర్వాత వ్యూహాన్ని సవరించుకున్నారు. లోక్‌సభలో మొత్తం 543 స్థానాలుంటే, మొదటి నాలుగు విడుతల్లో 374 నియోజకవర్గాలకు పోలింగ్ ముగిసింది. ఈ నెల ఆరవ తేదీన ఐదవ దశలో ఏడు రాష్ట్రాలలోని 51 స్థానాలకు పోలింగ్ జరుగనున్నది. యూపీ, బీహార్‌లలో నాలుగు విడతలు, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో ఒక విడుత, దక్షిణాది రాష్ట్రాలతో పాటు గుజరాత్‌లోని అన్ని స్థానాలకు పోలింగ్ ముగిసినందున దేశవ్యాప్తంగా బీజేపీ పరిస్థితి ఎట్లా ఉన్నదనే అంచనా వివిధ రాజకీయపక్షాల నాయకులకు ఏర్పడి ఉంటుంది. ఈ నేపథ్యంలో సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేశ్ వ్యాఖ్యలు కూడా గమనార్హమైనవి. యూపీలోని మహా సంఘటన దేశానికి కొత్త ప్రధానిని ఇస్తుందని అంటూనే, తన తండ్రి ములాయం ప్రధాని పదవి పోటీలో లేరని స్పష్టం చేశాడు.

# బాల కార్మికుల డీడీలు అందజేయాలి



విశాఖపట్నం : బాల కార్మికుల డిమాండ్ డ్రాఫ్టులు వారికి అందజేయాలని ఆర్డీవో ఫోరం కన్వీనర్ బి.వెంకట రమణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు కార్మిక సంయుక్త కమిషనర్‌కి వినతి పత్రాన్ని సమర్పించారు. గత కొద్ది సంవత్సరాలుగా ఈ డీడీలు కార్మిక విభాగం కార్యాలయంలో నిలిచిపోత ఎన్నా యన్నారు. పని ప్రదేశాలలో 18 సం॥లోపు కార్మికులకు విధించిన అపరాధ రుసుము డీడీలు వారికి 18సం॥ నిండిన తరువాత వారికి అందజేయాల్సింది ఉందని జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ టి.వెంకట రత్నంకు వివరించారు. అందుకు సాను కూలంగా స్పందిస్తూ జేసీఎల్ వాటిని అందజేయటానికి విభాగం సంసిద్ధంగా ఉందని తెలియజేశారు. విద్యాహక్కుచట్టం ఫోరం కన్వీనర్ హరితో పాటు... స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ సమన్వయకర్తలు కపర్థి, నాయుడు, సమాజహిత సంస్థ అధ్యక్షుడు కె.వి.ఎస్.నరసింహం పాల్గొన్నారు.

# ఆర్థోస్కోపిక్ వైద్య సదస్సు



విశాఖపట్నం : మోకాళ్లలో వచ్చే కీహోల్ సమస్యలపై విశాఖ ఆర్థోస్కోపిక్ అసోసియేషన్, ఇండస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఒక ప్రముఖ హోటల్‌లో ఆర్థోస్కోపిక్ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును ఫాదర్ ఆఫ్ ఆర్థోపెడిక్‌గా పేరుపొందిన ముంబాయికి చెందిన డాక్టర్ అనంత్‌జోషి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మోకాళ్లలో సంభవించే కీహోల్ లిగ్‌మెంట్స్‌కి, జాయింట్స్‌కు అందించే శస్త్ర చికిత్సల గురించి వివరించారు. చిన్న కోతతో అత్యాధునిక సాంకేతిక వైద్య పరికరాలను వినియోగించి చికిత్స అందించే విధానాలను తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కోయంబత్తూరుకు చెందిన ప్రముఖ ఆర్థోపెడిషియన్ డా.కార్తీక్ స్వరాజ్, డా.అస్లామ్ ఆరీఫ్, డా.జి.శ్రీధర్, డా.పి.అశోక్‌కుమార్, డా.భవానీ ప్రసాద్, 200మంది ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు పాల్గొన్నారు.

# అవినీతికి పాల్పడిన విఆర్‌పిపై చర్యలు తీసుకోవాలి



ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కొయ్యూరు : చీడిపాలెం పంచాయతీలో లక్షలరూపాయలు అవినీతికి పాల్పడిన విఆర్‌పి కాకూరి సుధారాణిని అధికారులు విచారించి తగు చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ కూలీలు సోమవారం కొయ్యూరు ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. చీడిపాలెం పంచాయతీలో కోనా కృష్ణ జీడిమామిడి తోటలో ఉపాధి పని జరిగినట్లు రికార్డులలో 613 పని దినాలకు గాను రూ.1,58,099 ఖర్చు చేసినట్లు 2014 జూన్ 19 కల్లా పని పూర్తయినట్లు చూపించారని, వాస్తవానికి ఆ యొక్క రైతు కోనా కృష్ణ సాగు భూమిలో వారం రోజులు కూడా పని జరగలేదన్నారు. అలాగే చీడిపాలెం గ్రామానికి చెందిన కోనా కాశీరాజు జీడితోటల్లో 407 పని దినాలు పని చేసినట్లు 1,17,950 ఖర్చు రాశారని, కానీ ఆ రైతుకి మొక్కలు ఇచ్చి గోతులు తవ్వినందుకు రూ.6వేలు మాత్రమే ఇచ్చారన్నారు. కాకరపాడుకు చెందిన నౌండ్రు వెంకటరమణ శ్రీనివాసరావు జీడిమామిడి తోటలో పని నిమిత్తం 2,34,563 ఖర్చు రాయగా వాస్తవంగాఆ రైతుకు 50 మొక్కలు మాత్రం ఇచ్చి రెండు రోజులు మాత్రమే పని చేయడం జరిగిందన్నారు. అలాగే బౌండ్రీ ట్రెంచ్‌ల పేరుతో పంచాయతీ పరిధి గ్రామాల్లో ట్రెంచ్‌లు తవ్వకుండానే కొంత మంది కూలీల పేరుతో విఆర్‌పి నిధులు స్వాహా చేశారన్నారు. చీడిపాలెం గ్రామంలో ఎటువంటి బౌండ్రీ ట్రెంచ్‌ల పని జరగలేదన్నారు. ఈ విధంగా అక్రమంగా ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులు స్వాహా చేసిన విఆర్‌పి వారికి సహకరించిన మేట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లకు తగు చర్యలు తీసుకొని రైతులకు ఉపాధి కూలీలకు న్యాయం చేయాలని వారు కోరారు. మొత్తం 40లక్షలు అవినీతికి వెలికి తీసి తగు చర్యలు తీసుకోవాలని చీడిపాలెం పంచాయతీ రైతులు ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేశారు. వారం రోజుల్లో పరిష్కరించకపోతే ఎంపిడిఒ కార్యాలయంలో వద్ద నిరాహారదీక్ష చేపడతామని ఉపాధికూలీలు హెచ్చరించారు.

**విఆర్‌పిపై విచారణ జరిపి ఉపాధి కూలీలకు న్యాయం చేస్తాం:**

చీడిపాలెం పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో జరిగిన అవకతవకలకై విచారణ జరిపి వారం రోజుల్లో చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ ఎస్‌కె.రహమాన్ తెలిపారు. విచారణ పూర్తయ్యేంత వరకు జరుగుతున్న ఉపాధి పనులు టిఎ ద్వారా నిర్వహిస్తామని, అప్పటి వరకు విఆర్‌పి సుధారాణిని విధుల నుండి తప్పిస్తున్నట్లు ఎంపిడిఒ తెలిపారు.

# నేడు అల్లూరి వర్ధంతి కార్యక్రమం

కొయ్యూరు : అల్లూరి కళా మందిరాలు మంప కొయ్యూరులకు రూ.50లక్షల చొప్పున నిధులు మంజూరు అయ్యాయని కేంద్ర కాఫీ బోర్డు మెంబరు, బిజెపి నేత లోకులగాంధీ తెలిపారు. 7న మంగళవారం ఎమ్మెల్సీ మాధవ్ మండలానికి వస్తున్నారని, మంప, రాజేంద్రపాలెంలోని అల్లూరి కళా మందిరాల వద్ద వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసే కార్యక్రమంలో పాల్గొని అనంతరం రాజేంద్రపాలెంలో బహిరంగ సభలో పాల్గంటారన్నారు. కేంద్ర మంత్రి నిధుల నుండి కోటి రూపాయల నిధులు అల్లూరి కళా మందిరంకు కేటాయించిన మాధవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అలాగే మంగళవారం రాజేంద్రపాలెంలో జరిగే సమావేశానికి కార్యకర్తలు అభిమానులు హాజరు కావాలని కోరారు.

## కవి సమయం

### మర్రిచెట్టు

ఊడలు నాటే మర్రిచెట్టులా!
ఎంతో ఘన చరిత్రగలది
కాంగ్రెస్‌పార్టీ
మహావృక్షంలా - వృక్షరాజు ఐ ఉంది
ఈ వృక్ష రాజుకు - చాపక్రింద నీరులా చేరి
అనతికాలంలో ప్రాంతీయ పార్టీలుగా వెలసిల్లే
రెండు నాలుకలతో మాట్లాడే నాగుపాములు
వాడి మీద, వీడు
వీడు మీద వాడు చాడీలు చెప్పుకొనే
దీపావళి టపాస్‌కాయలు
ఒక్కొక్క రాష్ట్రానికి
ఒక్కొక్క కళియుగరావణాసుడు గానో!
నరకాసురుడుగానో! తయారై
కాంగ్రెస్ ప్రగతిని - సుస్థిర స్థానాన్ని
భూస్థాపితం చెయ్యాలని చూస్తున్న
చీడపురుగులు
రాష్ట్రాన్ని - రంపపు కోతకోసి
మధ్య తరగతి కుటుంబీకులను
పీడించే - చండాలులు
వీరి మాటలు - చేష్టలు
విన్నా - కన్నా - చెడుగ ప్రవర్తించినా!
ప్రజాభిష్టంపై - భూస్థాపితం తథ్యం
ఈ సంక్షోభానికి కారకులెవ్వరు?
ఆ వెన్నుపోటు దారులెవ్వరు?
ఈ మధ్య తరగతి కుటుంబీకులను
ఆదుకున్న దెవ్వరు?
నువ్వేగదా! మర్రివిత్తువై ఇంతింతై
అంతై మర్రిచెట్టువై
నీ ఊడలు పెకిలించే నరకాసురులను
పథజర్పిన నాడే - నీ స్థానం - సుస్థిరం

**రచయిత**
**యల్.సిద్ధా**

## పంచాంగం

మాసం : వైశాఖ తిథి : తదియ రా.2,32; రోహిణి సా.4.54; ఉ.వ.8.54ల 10.30; రా.వ.10.23ల 11.57.

**మంగళవారం 07-05-2019**

**మేషం** : ఇతరులకు వాహనం ఇవ్వడంవల్ల ఇబ్బందులను ఎదుర్కొంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు తొలగిపోతాయి. వస్త్ర, బంగారం, వెండి ఫ్యాన్సీ వ్యాపారాల్లో పోటీతత్వం అధికంగా ఉంటుంది. ఉద్యోగరీత్యా దూర ప్రయాణాలు చేయవలసివస్తుంది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడరు ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. గృహ నిర్మాణానికి సంబంధించిన ప్లానుకు ఆమోదం లభిస్తుంది.

**వృషభం** : ఉద్యోగస్తులు, రాజకీయనాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. కానివేళలో ఇతరుల రాక ఇబ్బంది కలిగిస్తుంది. డాక్టర్లు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. ప్రముఖులతో పరిచయాలు వ్యాపకాలు అధికమవుతాయి. మిత్రులతో కలిసి షాపింగ్ చేస్తారు.

**మిథునం** : ఉపాధ్యాయులకు విద్యార్థుల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది జాగ్రత్త వహించండి. స్త్రీలకు అయిన వారి రాక సంతోషం కలిగిస్తుంది. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక, ఇసుక వ్యాపారులకు కలిసిరాగలదు. బ్యాంకు రుణాలు తీర్చడంతో పాటు కొంత రుణం తీసుకుంటారు. బంధువుల మధ్య సయోధ్య లోపిస్తుంది

**కర్కాటకం** : ఆర్థిక లావాదేవీలు, కుటుంబ సమస్యలు సమర్థంగా పరిష్కరిస్తారు. ఉద్యోగస్తులకు అధికారుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది. ఒక అవసరానికి ఉంచిన ధనం మరో ఖర్చుకు వినియోగించవలసి వస్తుంది. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు ఒత్తిడి, పనివారలతో చికాకులు తప్పవు..

**సింహం** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు.

**కన్య** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. వ్యవసాయ, తోటల రంగాల వారికి నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి.

**తుల** : స్త్రీలతో కలహములు, అన్ని కార్యముల యందు విఘ్నవ ులు ఎదుర్కొంటారు. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునరాలోచన మంచిది. ఏ వ్యక్తికీ అతి చనువు ఇవ్వటం మంచిది కాదు. రుణాలు, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తారు.

**వృశ్చికం** : కుటుంబ అవసరాలకు, మీ సంతానం కోసం ఫీజులు, బిల్లులవు చెల్లిస్తారు. వృత్తుల్లో వారికి గుర్తింపు లభిస్తుంది. ముక్కుసూటిగా పోయే మీ తీరు ఇబ్బందులకు దారితీస్తుంది. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనివారలతో చికాకులను ఎదుర్కొంటారు.

**ధనుస్సు** : ప్రింటింగ్ రంగాల వారికి బకాయిల వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. బంధువులకు పెద్దమొత్తంలో ధనసహాయం చేయునపుడు పునరాలోచన అవసరం. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

**మకరం** : ఉపాధ్యాయులకు నూతన వాతావరణం, పరిస్థితులు ఆందోళన కలిగిస్తాయి. సంఘంలో పలుకుబడి గల వ్యక్తుల సహకారంతో మీ పనులు సానుకూలమవుతాయి. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి.యాదృచ్ఛికంగా ఒక పుణ్యక్షేత్రం సందర్శిస్తారు.

**కుంభం** : స్త్రీలు చీటికి, మాటికి అసహనం, చికాకులు అధికమవుతాయి. అయిన వారిని, ఆప్తులనువిందు భోజనానికి ఆహ్వానిస్తారు. ఆకస్మిక ప్రయాణాలు వాయిదాపడతాయి. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. స్థిరాస్తుల కొనుగోలు యత్నాలు అను కూలిస్తాయి. మీ ఏమరుపాటుతనం, హడావుడి వల్ల వస్తువులు చేజార్చు కుంటారు. వ్యాపారాల్లో కొత్త కొత్త పథకాలతో కొనుగోలు దారు లను ఆకట్టు కుంటారు.

**మీనం** : ప్రతి చిన్న విషయానికి ఇతరులపై ఆధారపడటం మంచిది కాదు. ప్రైవేటు సంస్థలలోని వారికి యాజమాన్యంతో ఏకీభావం లోపిస్తుంది. భార్య, భర్తల మధ్య మనస్పర్థలు సమసిపోతాయి. వైద్యరంగాల్లోనివారికి శస్త్రచికిత్సల సమయంలో ఏకాగ్రత అవసరం. ఇసుక, భవన నిర్మాణ కాంట్రాక్టర్లకు ఆటుపోట్లు తప్పవు.

# ప్రజా ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు

## -జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్



విజయనగరం: పట్టణానికి చెందిన విజయ భాస్కర్ ఎస్పీగార్కి ఫిర్యాదు చేస్తూ తన భార్య తన తల్లిదండ్రులనుచూసేందుకు అంగీకరించడం లేదని, తనను మానసికంగా వేధిస్తూ, తనపై ఫిర్యాదులు చేస్తూ, తనకు అశాంతిని మిగులుస్తుందని, న్యాయం చేయాల్సిందిగా కోరారు. సోమవారం జిల్లా ఎఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఎ,ఆర్.దామోదర్ నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు వచ్చారు. ఈ ఫిర్యాదులపై స్పందించిన ఎస్పీ ఇరు వర్గాలకు కౌన్సిలింగు నిర్వహించి, ఫిర్యాదికి న్యాయం చేయాల్సిందిగా మహిళా పిఎస్ డిఎస్పీని ఆదేశించారు.విజయనగరం పట్టణానికి చెందిన రాణి ఎస్పీగార్కి ఫిర్యాదు చేస్తూ తాను ప్రేమించి వివాహం చేసుకున్న భర్త, చెడు వ్యసనాలకులోనై, తనను వేధింపులకు గురి చేస్తున్నాడని, న్యాయం చేయాల్సిందిగా కోరారు.

ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా ఎస్పీ కేసునమోదు చేసి, దర్యాప్తు చేసి, ఫిర్యాదికి న్యాయం చేయాల్సిందిగామహిళా పిఎస్ డిఎస్పీని ఆదేశించారు.శ్రీకాకుళం జిల్లాకు చెందిన శ్రీనివాసరావు ఎస్పీగార్కి ఫిర్యాదు చేస్తూ తన అవసరాల నిమిత్తం పూసపాటిరేగకు చెందిన ప్రసాద్ వద్ద రూ॥ 3 లక్షలు అప్పుగా తీసుకొని, విడతలుగా రూ॥ 3.20 లక్షలు చెల్లించినట్లు,అయినప్పటికీ సదరు వ్యక్తి తన నుండి తీసుకున్న ప్రామిసరీ నోటు ఇవ్వడం లేదని, న్యాయం చేయాల్సిందిగా కోరారు.

ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ ఇరు వర్గాలను పిలిపించి, వాస్తవాలను తెలుసుకోవాలని, చట్ట పరిధిలో న్యాయం చేయాల్సిందిగా పూసపాటిరేగ ఎస్ఐను ఆదేశించారు. విజయనగరం పట్టణానికి చెందిన గంగాధరరావు ఎస్పీగార్కి ఫిర్యాదు చేస్తూ తనకు ఔట్‌సోర్సింగులో ఉద్యోగ అవకాశం కల్పిస్తామని, నమ్మించి, తన నుండి రూ॥ 30వేలును కమలాకర్, సతీష్ కుమార్ అనే వ్యక్తులు తీసుకున్నట్లు, తనకు ఉద్యోగ అవకాశం కల్పించలేదని, డబ్బులు కూడా తిరిగి ఇవ్వడం లేదని, న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా ఎస్పీ ఇరువురిని పిలిపించి, వాస్తవాలనుతెలుసుకొని, చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా విజయనగరం 1వ పట్టణ సిఐను ఆదేశించారు.

విజయనగరం పట్టణం దుప్పాడకు చెందిన బోర సూరి ఎస్పీగార్కి ఫిర్యాదు చేస్తూ చంద్రరావు మరియు కొంతమంది వ్యక్తులు చిట్టీల పేరుతో రూ॥ 2 లక్షలు వసూలు చేసి, చెల్లించకుండా తిప్పుతున్నారని, న్యాయంచేయాల్సిందిగా కోరారు.

ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా ఎస్పీ వాస్తవాలను పరిశీలించి, చట్ట ప్రకారం చర్యలు తీసుకొని, ఫిర్యాదికి న్యాయం చేయాల్సిందిగా విజయనగరం 1వ పట్టణ సిఐను ఆదేశించారు.విజయనగరం మండలం కోరుకొండపాలెంకు చెందిన సురేష్ ఎస్పీగార్కి ఫిర్యాదు చేస్తూ తన భాగస్వామి సంతకం లేకుండా, సర్వే నంబర్లు తప్పులతో దీపికా కుమారి అనే ఆమె తనకు ఒక ప్లాట్‌ను విక్రయించి,మోసం చేసారని, న్యాయం చేయాల్సిందిగా కోరారు.

ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ ఇరువురి వర్గాలను పిలిపించి మాట్లాడాలని, కౌన్సిలింగు నిర్వహించి, ఫిర్యాదికి న్యాయం చేయాల్సిందిగా విజయనగరం రూరల్ సిఐను ఆదేశించారు. ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని,వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను తనకు వెంటనే నివేదించాలనిఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం. నర్సింహారావు, స్పెషల్ బ్రాంచ్ సిఐలు రామకృష్ణ, వైవి శేషు,ఎస్ఐ నీలకంఠం పాల్గొన్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# తప్పన ప్రమాదం

అనంతగిరి : అనంతగిరి మండలంలోని పర్యాటక కేంద్రమైన బుర్ర గుహలులో సోమవారం ఆంధ్రప్రదేశ్‌లో 13 జిల్లాల నుంచి స్పోర్ట్స్ బాలికల వేసవి విడిది కార్యక్రమంలో భాగంగా అరకు వ్యాలీ లో వచ్చి ఉన్నారు. సోమవారం ఐటీడీఏ వారు రెండు బస్సులులో బొర్ర గృహాలు చూడటానికి వచ్చి ఉన్నారు. గృహాలు చూసి తిరుగు ప్రయాణంలో ఒక బస్సు బ్రేకులు ఫెయిల్ అవ్వగా వెనక గా వెళ్లి ఒక మోటార్ సైకిల్ పైనుంచి వెళ్లి, బొర్రా క్యాంటీన్‌లోకి దూసుకెళ్లింది. వంటమనిషికి చిన్న దెబ్బలు తగిలాయి. సోమవారం పర్యాటకులు లేని కారణంగా పెద్ద ప్రమాదమే తప్పింది.

# జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం

భీమునిపట్నం : స్థానిక చిన్న బజార్ జంక్షన్ వద్ద కల్వర్ట్ లో గత కొన్ని రోజులుగా చాలా వాహనాలు పడిపోతున్నాయి.ఇంకా చిన్న పిల్లలు వృద్ధులు దీనిలో పడి ప్రమాదాలకు గురి అవుతున్నారు వెంటనే ఈ కల్వర్ట్ ని నిర్మించాలని అలాగే స్థానికి ఫుట్ బాల్ గ్రౌండ్ లో మరుగుదొడ్ల కు అవుట్ లేట్ లేక పోవడం తో మురికి నీరు బయటకి రావడం తో క్రీడా కారులకుతీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. అలాగే గ్రౌండ్ లో కనీసం తాగడానికి నీరు కూడా లేదు నీటి సదుపాయం కూడా కలిపించాలని, జిమ్ పరికరాలు వచ్చి ఐదు నెలలు అయినా ఇంత వరకు వాటిని ఉపయోగంలోకి తేలే దని ఈ సమస్యలపై అసోసియేషన్ అఫ్ పీపుల్ పవర్ సభ్యులు భీమిలి జోనల్ కమీషనర్ సి హెచ్.గోవిందరావు కు వినతి పత్రం అందజేసారు. దీనిపై కమీషనర్ మాట్లాడుతో త్వరలో ఈ సమస్య లను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

# దివీస్ ఉద్యోగి ఆత్మహత్య

భీమునిపట్నం : తగరపువలస దివీస్ లో ఉద్యోగం చేస్తున్న వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థానిక కొండపేట ప్రాంతంలో జరిగింది. పోలీసులు ఇచ్చిన వివరాలు ప్రకారం మేదరమెట్ల శ్రీరామమూర్తి చిప్పాడ దివీస్ లో ఉద్యోగం చేస్తూ కొండపేటలో తన భార్య, పిల్లల తో నివాసం ఉంటున్నారు. కాగా శనివారం అర్ధరాత్రి విధులు నిర్వహించి తన ఇంట్లో వేరే గదిలో పడుకున్నారు. కాగాఆదివారం తెల్లవారు జామున అతడి భార్య వచ్చి చూడగా ఉరివేసుకొని కన్పించడం తో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు భీమిలి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొన్నారు. దివీస్ కంపెనీలో పనిచేస్తున్న ఆయన ఇటీవలే వేరే డిపార్ట్మెంట్ కు పంపించారని అప్పటినుంచి ఆయన దిగులు గా ఉంటున్నట్లు చెప్పారు. పోలీసులు కేసును ధర్యాప్తు చేస్తున్నారు.

# ప్రశాంతంగా గ్రూప్ 2 పరీక్షలు

భీమునిపట్నం : భీమిలి ప్రాంతంలో నాలుగు పరీక్ష కేంద్రాలలో గ్రూప్ 2 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. అభ్యర్ధులను గంట ముందు పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. ఈ కేంద్రాలలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇందులో భీమిలీ పండిట్ నెహ్రూ ప్రాధమికోన్నత పాటసాల కేంద్రానికి 240 మందిని కేటాయించగా 149 మంది మాత్రమే పరీక్ష కు హాజరయ్యారు. సెయింట్ ఆన్స్ హైస్కూల్ కేంద్రానికి 250 మందికి 148 మంది , గవర్నమెంట్ హై స్కూల్ కేంద్రానికి 240 మందికి 147మంది, అలాగే పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్ కేంద్రానికి 240 మందికి 149 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. వేసవి దృష్ట్యా ప్రతి పరీక్షా కేంద్రంలోని ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు మంచినీటి సౌకర్యాలు కల్పించారు.

### ఆటపాటలతో చదువు నేర్పించడమే ప్రీ స్కూల్స్ లక్ష్యం
### మున్సిపల్ కమిషనర్ ఎస్.ఎస్.వర్మ



విజయనగరం : పిల్లలకు ఆటపాటలతో చదువు నేర్పించడమే ప్రీ స్కూల్స్ లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఎస్.వర్మ అన్నారు. సోమవారం ఆయన చాంబర్‌లో ప్రీ స్కూల్స్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పురపాలక శాఖ సహకారంతో ప్రీ స్కూల్స్ ప్రారంభించిన నాటి నుండి అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్య రెట్టింపు అయ్యిందన్నారు. పిల్లలకు తెలుగుతో పాటు ఇంగ్లీష్ కూడా నేర్పించాలని సూచించారు. పురపాలక సంఘం తరపున త్రాగునీరు, మరుగుదొడ్లు, టి.వి తదితర ఇతర సౌకర్యాలను కల్పించడం జరిగిందన్నారు. వచ్చే సంవత్సరం నుండి యూనిఫాం కూడా పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. స్త్రీ శిశు సంక్షేమం, మున్సిపల్ శాఖల సమన్వయంతో పట్టణంలో 161 అంగన్వాడీ స్కూల్స్‌ను మెర్జి చేసి 52 ప్రీస్కూల్స్‌గా మార్చడం జరిగిందన్నారు. ప్రీ స్కూల్స్ పెట్టాక ప్రైవేట్ స్కూల్స్ నుండి అంగన్వాడీలకు పిల్లలు రావడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా కార్పొరేట్ స్కూల్స్‌కు ధీటుగా అంగన్వాడీల్లో టీచర్లు చదువు నేర్పించాలని సూచించారు. ప్రతీ గదిలో టీవీ ద్వారా పిల్లలకు రైమ్స్ నేర్పించాలని సూచించారు. పట్టణంలోని ప్రీ స్కూల్స్‌లో ఏమైనా సమస్యలు ఉంటే అధికారులు తన దృష్టికి తీసుకుని వస్తే వాటిని పరిష్కరిస్తానన్నారు. అలాగే ప్రీ స్కూల్స్‌లో చదివే విద్యార్థులు తదుపరి ప్రభుత్వ పురపాలక పాఠశాలల్లో చేరే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలని సూచించారు. ఈ విషయంలో ప్రీ స్కూల్స్, పురపాలక పాఠశాలల ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు లభిస్తాయన్నారు. అలాగే ఈ విద్యా సంవత్సరంలో ప్రీ స్కూల్స్‌లో అధిక సంఖ్యలో పిల్లలు జాయిన్ అయ్యేవిదంగా ప్రచారం కల్పించాలని సూచించారు.

# వైభవంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం





అనకాపల్లి : స్దానిక గవరపాలెం పల్లపువీధిలో శ్రీ అభయాం జనేయ స్వామివారి ఆలయ 5వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం నుండి భక్తులు ఆల యానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకి ఎటు వంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసు కున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జై అనకాపల్లి సేన నాయకులు కొణతాల సీతారాం, హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన వీరిని హనుమాన్ యూత్ సభ్యులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దుశ్శా లువతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమా రాధన కార్యక్రమాన్ని సీతారాం ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో హను మాన్ యూత్ సభ్యులు బుద్ధ శ్రీను, చదరం సంతోష్, ఎస్. ప్రవీణ్, త్రినాధ్, నూకేష్, లోకేష్, మురళీ, దిలీప్, నరేంద్ర, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ హితైషికి భార్గవశ్రీ అవార్డ్

## - అభినందనలు తెలిపిన పలు బ్రాహ్మణ సంఘాలు, నాయకులు



యలమంచిలి : రాష్ట్రీయ బ్రాహ్మణ ఫ్రంట్ అధ్యక్షుడు కాశీభట్ల సాయినాథశర్మ భార్గవశ్రీ పుర స్కారానికి ఎంపికైనందుకు రాంబిల్లి మండలం లోని పంచదార్ల గ్రామానికి చెందిన రాష్ట్రీయ బ్రాహ్మణ ఫ్రంట్ పొలిట్ బ్యూరో సభ్యుడు మరియు రాష్ట్ర అధ్యక్షుడు అయిన వసంతవాడ పురుషోత్తమ రాజు, వసంతవాడ దిన్‌బాబు, యలమంచిలి పట్టణానికి చెందిన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాచకొండ శ్రీనివాస శర్మ, పెద్దింటి సూర్యనారాయణ మూర్తి, జిల్లాలోని పలు బ్రాహ్మణ సంఘ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక, ఆధ్యా త్మిక, రాజకీయ రంగాల్లో చురుగ్గా పనిచేస్తూ, బ్రాహ్మణ జాతి అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తున్న కాసిభట్ల సాయినాథశర్మకు ఈ పుకస్కారం లభించడంపై శ్రీనివాస్ శర్మ హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 7వ తేదీన రాజమండ్రి పట్టణంలోని స్వాతంత్ర్య సమర యోధుల భవనం ఆవరణలో ఈ పురస్కారం సాయినాథశర్మకు ఇవ్వనున్నట్లు రాచకొండ శ్రీనివాస్ తెలిపారు. సాయినాథ్ శర్మకు ఈ అవార్డు రావడం పట్ల జిల్లాలోని పలు బ్రాహ్మణ సంఘాలు హర్షం వ్యక్తంచేశాయి.

# ఆక్రమణలు తొలగించిన రెవిన్యూ అధికారులు



మధురవాడ : ప్రభుత్వ భూములు కాపాడే పనులో చినగదిలి మండల రెవెన్యూ అధికారులు నిమగ్నమయ్యారు ప్రభుత్వ భూములు కబ్జా చేసిన కబ్జాదారుల పై గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారు. సోమవారం మహా విశాఖ నాల్గవ వార్డ్ పరదేశి పాలెం సర్వే సంఖ్య109 లోమొత్తం నాలుగు ఎకరాల డబ్బై ఆరు సెంట్లు అధికార పార్టీకి చెందిన కొంతమంది చోటా మోటా నాయకులు అధికార బలంతో అప్పనంగా ప్రభుత్వ భూములను కాజేసి లక్షలాది రూపాయలకు అమ్మకాలు జరిపేశారు ఇందులో ఇరవై అయిదు సెంట్లుకు అపడివిట్ తో మన్యాల కొండమ్మ పేరు మీద కోర్టు కు వెళ్లారు.

అలాగే ఇదే ప్రభుత్వ భూమిలా మరో మూడు భారీగా షెడ్లను ఆదివారం నిర్మించినట్లు అక్రమణ కు గురయిందని సమాచారం అందడంతో రూరల్ తహసీలుదారు శేషగిరిరావు ఆదేశాలు మేరకు అక్రమ నిర్మాణమును ఈరోజు తొలగించి నట్లు స్పెషల్ ఆర్ఐ సత్యనారాయణ తెలిపారు, ఇది ఇలా ఉండగా కొండమ్మ అనే మహిళా మమ్మల్ని బ్రతకనివ్వరా అని అధికారులు పై వాగ్వాదం చేసి ఒంటి పై కిరోసిన్ పోసుకుని చచ్చిపోతానని కన్నీటి పర్యాంతమయింది, తొలగింపు కార్యక్రమం లో విఆర్ఓ అప్పారావు, విఆర్ఎలు బంగార్రాజు, చిన్నారావు, శ్రీను, అప్పలరాజులు పాల్గొన్నారు.

# దొంగతనాలు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండండి

## విజయభాను ప్రతినిధితో బి.వై.నాయుడు



పరవాడ : దొంగతనాలుపట్లప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ పరవాడక్రైం ఎ.ఎస్.ఐ బి.వై.నాయుడు అన్నారు. సోమవారము అయన విజయభాను ప్రతినిదితో మాట్లడుతూ వేసవి కాలము, మహి ళలు బంగారు నగలు ధరించి ఇంటి బయట గానీ మిద్దెమీదగాని నిద్రించకూడదు అని అన్నారు. ఇంటి తలపులు తెరచి లోపల పడుకోవద్దు అని, ఇంటిలోపల పడుకున్నప్పుడు లోపల నుండి డోర్స్ లాక్ చేసుకోవటం మరిచి పోవద్దు తెలిపారు. ఇంట్లో వారందరు ఊరు వెల్లాల్సి వస్తే మీ విలువైన బంగారు, వెండి ఆభరణాలు, డబ్బులు బ్యాంక్ లాకర్ లో భద్రపరచా లనీ అన్నారు. బంగారు వస్తువులు మెరుగు పెడతామని ఎవరయినా మీ ఇంటికి వస్తే వారిని నమ్మవద్దు, వెంటనే మాకు 100 నంబర్ కు సమచారం ఇవ్వండిఅంతేకాక ఇంటిలో శాంతి పూజలు చేస్తామని పూజలో బంగారు వస్తువులు పెట్టమని మాయగాళ్లు చెపుతారు నమ్మవద్దు, అలాంటి వారు వస్తే మాకు వెంటనె 100 నంబర్ కు సమాచారం తెలియపరచాలనీ అన్నారు.తక్కువ ధరకే బంగారం ఇస్తామని ముందు చిన్న బంగారం వస్తువు చూపించి తరువాత నకిలీ బంగారు బిస్కట్స్, నకిలీ వడ్డాణాలు ,నకిలి నకిలెస్‌లు అమ్ముతారు నమ్మి మోసపోవద్దు అని తెలిపారు. బస్సుల్లో ఆటోల్లో ప్రయాణిం చేటపుడు మీ బంగారము, డబ్బులు పర్సులో పెట్టి బ్యాగ్ లో పెట్టినపుడు దొంగలు తోటి ప్రయా ణికుల వలే నటించి మీకు తెలియకుండానే మీ బంగారం మరియు డబ్బులు దొంగి లిస్తారు కాబట్టితగుజాగ్రతలు వహించండి. మీ ద్విచక్ర వాహ నాలకు తప్పనిసరిగా తాళాలు వేయండి. అరిగిపోయిన తాళాలు వెంటనే మార్చుకోండి లేకపోతే దొంగలు వెరే దొంగ తాళాలతో మీ వాహనాలు దొంగిలిస్తారుఅని తెలిపారు.బ్యాంక్ నుండి డబ్బులు డ్రా చేసుకొని తీసుకొని వస్తున్నపుడు క్రింద డబ్బుల నోట్లు వేసి మీ ద్రుష్టి మళ్లించి మీ డబ్బులు, బ్యాగ్ దొంగిలిస్తారు జాగ్రత పడండిఅనిఅన్నారు.మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టం గల తాళం వేయించుకోండి. మీ ఇంటికి తాళం వేసి ఊళ్లకు వెళ్లే సమయంలో ఎపిపోలీసు ప్రవేశ పెట్టినఎల్ హెచ్ ఎమ్ యస్ లాక్డ్ హౌస్ మాని టరింగ్ సిస్టము యాప్ ను ఉపయోగించుకో వాలనీ అని అన్నారు.వృద్దుల వంటిపై బంగారము ఆభరణాలు ఉన్నపుడు వారిని ఒంటరిగా ఇంటిలో ఉంచరాదు మరియు వారిని ఒంటరిగా బయటకి పంపరాదుఅని తెలిపారు. ఎటిఎం కు వెళ్లినపుడు వీలైనంతవరకు ఇతరుల సహాయం తీసుకోరాదు మరియు ఇతరులకు మీ ఎటిఎమ్ పిన్ నంబర్ చెప్పవద్దు అనిఅన్నారు. బ్యాంక్ నుండి ఫొన్ చేస్తున్నాం మీ ఎటిఎమ్ పిన్ నంబర్ గాని దానిపైన గల నంబర్ గాని లేదా మీ అకౌంట్ నెంబర్ చెప్పండి అని గుర్తుతెలియని వ్యక్తులు ఫొన్ చేసి అడిగితే చెప్పకూడదు . చెప్పినచో మీ డబ్బులు ఆన్ లైన్ లో డ్రా చేసుకుంటారుకాబట్టి తగు జాగ్రత్తలు పాటించండి అనిఅన్నారు. బస్సులలో ట్రైన్లలో అపరిచితులు ఎమైనా తినుబండారాలు ఇచ్చినా వాటిని మీరు తినవద్దు ఎందుకనగా వాటిలో మత్తు పదార్థాలు కలిపి మిమ్ములను స్పృహ కోల్పోయేలా చేస్తారు

ఆ తరువాత మీ దగ్గర గల బంగారం, డబ్బులు మరియు ఇతర విలువయిన వస్తువులు దొంగిలిస్తారు. పోలీసుల అత్యవసర సేవల నిమిత్తం 100 డైల్ ఉపయోగించుకోవాలనీ క్రైంఎఎస్ ఐ బి.వై.నాయుడు తెలిపారు.

# ఈనెల 13న శ్రీ పైడితల్లమ్మవారి దేవర మహోత్సవం



విజయనగరం: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీపైడితల్లమ్మవారి దేవర మహోత్సవం ఈనెల 13వ తేదీన వనంగుడి(రైల్వేస్టేషన్ దగ్గర) నిర్వహిస్తున్నామని దేవస్థానం ఇ.ఓ. టి అన్నపూర్ణ తెలిపారు. ఆలయ ప్రధాన పూజారి బంటుపల్లి వెంకటరావు చదురుగుడిలో సాంప్ర దాయ పూజలు చేశారు. అనంతరం డప్పుల నాదాలతో ఆలయ తలయారి రామవరపు పైడిరాజుఅమ్మవారి దేవర ఉత్సవం చాటింపు వేశారు. 13వ తేదీన వనంగుడిలో అమ్మవారికి స్నపనం పూజలుచేసి అమ్మవారిని స్థానిక హుకుంపేటలో ఉన్న చదురుగుడి చేర్చి రాత్రి 10 గంటలకు మేళతాళాలతో...విచిత్రవేషధారణల మధ్య ఊరేగింపు నిర్వహిస్తారు. 14వతేదీ ఉదయం మరలా అమ్మ వారి దర్శనార్థం ఉంచుతారని తెలిపారు.

# వాటర్ ట్యాంక్ వితరణ



భీమునిపట్నం : భీమిలి డివిజన్ వార్డ్ 23 గొల్లలపాలెం వాంబే కోలని లో నీటి సమస్య అధికంగా ఉన్నాది. ఈ ప్రాంతంలో సుమారు రెండువందల కుటుంబాలు నివస్తున్నాయి జోనల్ కార్యాలయం నుంచి రొజూ వాటర్ ట్యాంక్ లు వస్తున్నా నీరు సరిపోక పోవడం తో అక్కడ వున్ననీటి ఎద్దడని తెలుసుకొని ఆ ప్రాంత టిడిపి మాజీ తెలుగు యువత అద్యక్షులు కోండ్రు శేఖర్ బాబు తన సొంత నిదులు సుమారు అరవైలుతో వాటర్ ట్యాంక్ ని ఏర్పాటు చేశారు..దానిని సోమవారం శేఖర్ బాబు తల్లి కోండ్రు రామయ్యమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయుకులు పీతల.వెంకటరావు,వియ్యపు.పోతురాజు, వియ్యపు తవుడు బాబు, రాంబాబు, బీసపు రవి, సూర్యనారాయణ రాజు, తది తరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మనోవికాసాన్ని పెంపొందించుకోవాలి



విశాఖపట్నం : డాబాగార్డెన్స్ ప్రేమసమాజం మినీ సమావేశ మందిరంలో బాలవికాస్ ఫౌండేషన్ నిర్వహణలో ప్రేమసమాజం వారి సౌజన్యంతో విద్యార్థినీ విద్యార్థులకు మనో వికాస శిక్షణా శిబిరం ఘనంగా ప్రారంభమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతి ధిగా కళా హాస్పటల్ ఎం.డి. డా॥పైడి వెంకటరమణ మూర్తి హాజరై జ్యోతిని వెలిగించి మనోవికాస శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ వేసవి శిక్షణా శిబిరాల ద్వారా విద్యార్థులు మనోవికాసాన్ని పెంపొందించు కోవాలన్నారు. ఎండలు తీవ్రంగా వున్నాయి కనుక విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని విద్యార్థులకు తెలిపారు. చక్కని శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్న బాల వికాస్ ఫౌండేషన్ వారిని అభినందించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన వైజాగ్ ఫిల్మ్ సొసైటి సభ్యులు గవర వెంకట సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు మేథా శక్తిని పెంపొందించుకోవాలన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎం.వి. రాజశేఖర్ మాట్లాడుతూ బాల వికాస్ ఫౌండేషన్ వారిని ప్రశంసించి సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేజిక్ శిక్షకులు మెజీషిన్స్ ఎస్.కె.అన్వర్ భాషా, అంతర్జాతీయ గుర్తింపు పొందిన బి.ఎస్.రెడ్డిలు పాల్గొని మ్యాజిక్ షో నిర్వహించి విద్యార్థులకు మేజిక్‌పై అవగాహన పెంపొందించారు. సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ 9వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 10గం॥ల నుండి మధ్యాహ్నం 12గం॥ల వరకు నిర్వహిస్తున్న శిక్షణా శిబిరంలో విద్యార్థులు ఉచితంగా పాల్గొన వచ్చును అని అన్నారు. 8,9 తేదీలలో సీనియర్ జర్నలిస్టు కార్టూన్ మేకర్ జానా కార్టూన్ మేకింగ్‌పై శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు, పడాల వెంకటేశ్వరరావు, ప్రముఖ అధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్, విద్యార్థులు, ప్రేమసమాజం బాలబాలికలు పాల్గొన్నారు.

# ఎన్‌పేట గ్రామంలో మంచినీటి సమస్య తీర్చాలని మోకాళ్లతో నిరసన

రోలుగుంట : రోలుగుంట మండలం ఎంకె.పట్నం పంచాయితీ గ్రామం ఎన్‌పేట గిరిజన గ్రామానికి మంచి నీటి సమస్య తీర్చాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం రోలుగుంట ఎంపిడిఒ కార్యాలయం వద్ద మోకాళ్లతో నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ గత మూడు నెలల కిందట మూడు సార్లు మంచి నీటి సమస్య ఉందని ఉందని అధికారులు దృష్టికి తీసుకువచ్చినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. కనీసం తాగడానికి మంచినీరు ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. అనంతరం ఎంపిడిఒను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ నాలుగు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు రమణమ్మ, దేవుడు పెద్దోడు, లక్ష్మి పాల్గొన్నారు.



మంచినీటి సమస్య తీర్చాలని మోకాళ్లతో నిరసన తెలుపుతున్న దృశ్యం

# విస్తృతంగా ఐలు జిల్లా కార్యవర్గం

## నలుగురు కార్యదర్శులు, నలుగురు ఉపాధ్యక్షులు




కాకినాడ : ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలూ) తూర్పు గోదావరి జిల్లా కార్యవర్గం విస్త ృతంగా ఏర్పడింది.ఐలు రాష్ట్ర కార్యదర్శి ఎన్ .వెంకటేశ్వరరావు ఎన్నికల అధికారిగా తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గం 27 మందితో, నలుగురు కార్యదర్శులు ,నలుగురు ఉపాధ్యక్షులుతో ఏర్పడింది. కాకినాడ స్మార్ట్ సిటీ, కాకినాడ బార్ అసోసియేషన్ కు చెందిన 10మంది న్యాయవాదులకు ఇందులో పదవులు దక్కాయి. ఐలు తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గానికి జిల్లా అధ్యక్ష బాధ్యతలకు ...కాకినాడ కు చెందిన మేడపాటి ధర్మారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కాకినాడకు చెందిన గోపన సునీల్ కాంత్ ఎన్నికయ్యారు. ఈ రెండు పదవులకే కాక కార్యదర్శిగా జి.వి. దేసి,ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఎం.రామారెడ్డి,ఏ.అప్పారావు,వై.వసంత,బి. వి. రమణ, సుదిన శ్రీనివాస్, బి.నరేంద్ర, కె.దయానంద్ రాజులు ఎన్నికయ్యారు. అమలాపురం నకు దక్కిన మూడు పదవుల్లో ఉపాధ్యక్ష పదవిని బండి రామక ృష్ణ, కార్యదర్శి పదవిని వసంత కుమార్, ఈసీ సభ్యత్వంనకు సి హెచ్ ఎస్ ఆర్ కె నాగేశ్వరరావులు ఎన్నికయ్యారు. పిఠాపురానికి ఐదు పదవులు దక్కాయి. ఉపాధ్యక్షుడిగా కె.వీరమణ రావు, కార్యదర్శిగా భాస్కర చార్యులు ,ఈసీ సభ్యులుగా సి హెచ్ ఎస్ వి ఎస్ ఎన్ ప్రసాద్ శర్మ, కే.సత్యవేణి, రాజకుమార్‌లు పదవులు పొందారు. ఉపాధ్యక్షులుగా తుని నుంచి డి.రవి కుమార్, అనపర్తి నుంచి ఆర్. వి.జి. పట్నాయక్ లు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యుడిగా జె.వి.రమణమూర్తి కూడా అనపర్తి నుంచి ఎన్నికయ్యారు.రామచంద్ర పురం నుంచి కార్యదర్శిగాఎస్.హరికృష్ణ పదవిని పొందారు. ఇంకా కార్యవర్గ సభ్యులుగా అమరావతి నుంచి భీమశంకర్, రాజమహేంద్రవరం నుంచి పి.వి. జయ రామ కృష్ణ, పెద్దాపురం నుంచి షేక్ వల్లి బాబు ఎన్నికయ్యారు. కోశాధికారిగా ప్రత్తిపాడుకు చెందిన ఏ.కే.ఎన్. మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యుడిగా ప్రత్తిపాడు నుంచి సిహెచ్.ఎస్.ఎన్. జి.ఏ.రాజు ఎన్నికయ్యారు.

## దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

భీమునిపట్నం : వేసవి కాలంలో రాత్రి సమయంలో దొంగతనాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని భీమిలి క్రైం ఎస్.ఐ కె.మధుసూదనరావు అన్నారు. స్థానిక క్రైం పోలీస్ స్టేషన్లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో చాలామంది ఇంట్లో గాలి లేక ఉక్క పోతకు గురి అవుతున్న నేపధ్యంలో బయట పడుకుని ఉంటారు. ముఖ్యంగా మహిళలు బంగారు ఆభరణాలు ధరించి ఆరుబయట,మిద్దెమీద పడుకునేవారు చాలామంది ఉంటారు. అయితే ఇదే అవకాశంగా తీసుకుని దొంగలు చెలరేగి పోతుంటారనీ తెలిపారు. అలాంటి సమయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని, బయట పడుకునేవారు ఇంటికి తాళాలు వేయడమే కాకుండా తమ వద్ద ఎలాంటి విలువైన వస్తువులు ఉంచకూడదని, ఇంటి తలుపులు తెరచి లోపల పడుకోవద్దని అన్నారు. ఇంట్లో మొత్తం ప్రయాణం చేయవలసి వచ్చినపుడు ఇంట్లో విలువైన వస్తువలు బ్యాంక్ లాకర్ లో పెట్టాలని సూచించారు. అంతేకాకుండా గ్రామంలో మెరుగు పెట్టె నెపంతో కొంతమంది సేల్స్ మెన్‌గా వచ్చి మీ దృష్టి మళ్లించి మీ విలువైన వస్తువులను తీసుకునే వెళ్ళే అవకాశాలు ఇటీవలే ఎక్కువగా జరుగుతున్నాయని అలా ఎవరైనా వస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని అన్నారు. ప్రతీ షాప్ యజమాని వారి షాప్‌లకు సిసి కెమెరాలు పెట్టాకోవాలని. గ్రామంలో కి అపరిచిత వ్యక్తులు ఎవరైనా వస్తే వెంటనే పోలీసులకు పిర్యాదు చేయాలని కోరారు . ప్రతి గ్రామానికి గుడి, బడి కమిటీ లు ఉంటాయి కాబట్టి కమిటీ నుంచి నైట్ వాచ్ మేన్ పెట్టుకోవాలని. బస్సులలో, ఆటోలలో ప్రయాణం చేసేటప్పుడు బంగారు ఆభరణాలు,డబ్బులు పర్సులు చాలా జాగ్రత్తగా చూసుకోవాలని, అంతే కాకుండా విలువైన ఆభరణాలు వేసుకున్న వృద్ధులను ఇళ్ళల్లో ఒంటరిగా ఉంచరాదని తెలిపారు. ఎ.టి.ఎంకు వెళ్ళి నపుడు ఇతరుల సహాయం తీసుకోరాదనీ. ఈ విషయంలో పోలీస్ వారి సూచనలు పాటించి,అప్రమత్తంగా ఉండాలని సి ఐ మధుసూదనరావు కోరారు.

## రత్నగిరిపై భక్తుల రద్దీ

అన్నవరం...... తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారిని సోమవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొన్నారు.వైశాఖ మాసము కావడం అందలోనూ వేసవి శెలవులు కావడంతో మండుతున్న ఎండలను కూడా లెక్కచేయకుండా భక్తులు వ్రతాలు,దర్శనాలు పూర్తిచేసుకొని సత్రం గదులకే పరిమితం అవుతున్నారు.సాధార భక్తులు చెట్టు నీడన సేద తీర్చుకొంటున్నారు.ఎండ తీవ్రతకు దేవస్థానం వారు ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ భక్తులకు కొంత మేరకు ఉపశమనము కలుగుతుంది.

## చికిత్స పొందుతూ రేగాని వెంకటరావు మృతి

భీమునిపట్నం : గత వారం భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని గొల్లలపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన రేగాని వెంకటరావు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. గత వారం వెంకటరావు తన భార్యతో రోడ్డు దాటుతుండగా భీమిలి పోలీస్ స్టేషన్ రైటర్ కారు ఢీ కొని ఇరువురికీ తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం సాయంత్రం చికిత్స పొందుతూ రేగాని వెంకటరావు మరణించారు. దీనిపై భీమిలి పోలీసులు కేస్ నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.

## అల్లూరి వర్ధంతి సందర్భంగా వ్యాసరచన పోటీలు

భీమునిపట్నం : అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించు కుని ఆదర్శ హిందీ ప్రేమీమండలి అధ్యక్షులు కె.ఎస్.ఆర్ కృష్ణారావు ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు అల్లూరి సీతారామరాజు జీవితవిశేషాలపై తెలుగు,హిందీ భాషలలో స్థానిక పండిట్ నెహ్రూ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను మే 7 న అల్లూరి సీతారామరాజు వర్ధంతి రోజున భీమిలిలో ఆయన విగ్రహం వద్ద బహుమతులు అందజేస్తారని ఆయన తెలిపారు.

## గ్రామాల్లో హిందూ ప్రచార రథం ద్వారా ప్రచారం కల్పించాలి... చిలుకూరి



అన్నవరం....తూ.గో.జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి చిలుకూరి రామ్ కుమార్ అన్నవరం దేవస్థాన ఈ.ఓ.ఎం.వి.సురేష్ బాబును కలిసి హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా సత్యనారాయణస్వామి రథం గ్రామ గ్రామానా తిరిగి ప్రచారం చేయలని,డయల్ యువర్ ఈ.ఓ మరియు చైర్మన్ కార్యక్రమాన్ని తిరిగి పునరుద్ధించాలని అలాగే కొండపైన ద్వారకాతిరుమల మాదిరిగా ఉచిత డార్మెటరీ హల్స్(వేచి ఉండు గది) నిర్మిస్తే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుంది అని కోరి ఈ.ఓ గారికి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా దేవస్థానం కొండపైకి అన్యమత స్టిక్కర్లు ఉన్న వాహనాలు వస్తున్నాయని మరియు కొండ క్రిందన ఉన్న అన్యమతస్తుల మైక్ సౌండ్స్ కొండ పైకి వినిపిస్తున్నాయి వీటివలన భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి అని వీటి మీద కూడా చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటిని కోరారు.ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు సింగిలిదేవి సత్తిరాజు, అవసరాల.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

# చందనోత్సవ ఏర్పాట్లను సక్రమంగా నిర్వహించండి

## పారిశుద్ధ్యం, వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చూడండి

## భక్తులకు అసౌకర్యాలు కలగకుండా చూడండి

## జివిఎంసి కమిషనర్ హరినారాయణన్





విశాఖపట్నం : చందనోత్సవ ఏర్పాట్లలో భాగంగా పారిశుధ్యం, త్రాగునీరు, విద్యుత్ మరియు టాయిలెట్స్‌ను సక్రమంగా నిర్వహించాలని జివియంసి కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా సింహాచలం క్షేత్రాన్ని సందర్శించి సోమవారం పలు సూచనలు చేశారు. పారిశు ధ్యం కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించి, పర్యవేక్షించాలని సి.యం.ఓ.హెచ్ డా.ఎ.హేమంత్ , ఏ.యం.ఓ.హెచ్ డా. లక్ష్మితులసిలను ఆదేశించారు. వేసవి తీవ్రత ఉన్నందున నిర్దేశించిన ప్రాంతాలలో త్రాగునీటి సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకోవాలని ఇ.ఇ రాజారావును ఆదేశించారు. చందనోత్సవం కార్యక్రమానికి జివియంసి తరపున నిర్వహించవలసిన విద్యుత్, వీధిదీపాలు ఏర్పాట్లను చూడాలని ఏ.ఇ ని ఆదేశించారు. అదేవిధంగా టాయిలెట్లను ఎప్పటికప్పుడు శు భ్రపరచడం ద్వారా యాత్రికులకు అసౌకర్యం కలగకుండా చూడాలని పేర్కొన్నారు. పారిశుధ్య నిర్వహణకోసం అవసరమైన కార్మికులను వినియోగించి పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కోరారు. పర్యటనలో ఆరవ జోనల్ కమిషనర్ మల్లం నాయుడు, శానిటరీ సూపర్‌వైజర్ విక్రమ్, ఏసిపి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఫొని తుఫాన్ బాధితులను ఆదుకోవాలి



భీమునిపట్నం : భీమిలి డివిజన్ టిడిపి అధ్యక్షులు గంటానూకరాజు ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే పెద్దలు మాటలు దృష్టిలో పెట్టుకుని ఫొని తుఫాన్ కారణంగా వీధిన పడిన బాధితులను మానవతాదృ కృధంతో ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం ముందస్తు చర్యలు చేసినా శ్రీకాకుళం జిల్లా కోస్తా మండలాలను ఒడిశా లోని తీరప్రాంతాలను అతలాకుతలం చేసినట్లు తెలిపారు. మనం చేసిన చిన్న సహకారమే వాళ్లకు కొండంత బలమనీ చెప్పారు.స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, పారిశ్రామిక వేత్తలు,ప్రజాసంఘాలు,ప్రభుత్వ రంగ సంస్థలు వారిని ఆదుకోవాలని నూకరాజు పిలుపు నిచ్చారు. రాజకీయ పార్టీలకతీతంగా ప్రతీ ఒక్కరు ఈ సేవలో పాలుపంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొండ్రు శేఖర్ , నాయకులు డెక్కతి సూర్యనారాయణ, కృష్ణారావు మాస్టర్, కాసరపు నాగరాజు ,గిడుతూరి శ్రీనివాసరావు,మారోజు సంజీవ్ కుమార్,,కనకల అప్పలనాయుడు, కొక్కిరి అప్పన్న,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళితో ట్రస్ట్ బోర్డ్ సమావేశం వాయిదా

అన్నవరం: తూ.గో.జిల్లా ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఈ నెల 12న జరగవలసిన అన్నవరం దేవస్థానం పాలకమండలి సమావేశం వాయిదాపడినట్లు ట్రస్ట్ బోర్డ్ సభ్యుడు సింగిలిదేవి సత్తిరాజు తెలిపారు. తనకు అందిన సమాచారం మేరకు సమావేశం వాయిదా అంశంపై మరో సభ్యుడు అవసరాల వీర్రాజుతో కలిసి ఆదివారం ఆలయ ఈ.ఓ ఎం.వి. సురేష్ బాబును కలిసి వివరణ కోరామన్నారు. అయితే ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల మౌఖిక ఆదేశాల మేరకు వాయిదా వేసినట్లు తెలిపారన్నారు.ఇటీవల కోడ్ విషయంలో జిల్లాకు ఇచ్చిన సడలింపు కేవలం తుఫాన్ కు సంబంధించి మాత్రమేనని ఇతర అంశాలకు యధావిధిగా కోడ్ వర్తిస్తుందని తెలిపినట్లు సత్తిరాజు పేర్కొన్నారు. కాగా ప్రస్తుత పాలకమండలి పదవీకాలం వచ్చేనెల 2తో ముగియనుంది. ఈ నెల 23న ఎన్నికల ఫలితాలు వచ్చిన అనంతరం ఎన్నికల కోడ్ ఎత్తివేసే అవకాశముంది. ఆ తర్వాత జరిగే సమావేశమే ప్రస్తుత పాలకమండలి సభ్యులకు చివరి సమావేశం కానుంది.

## అన్నా మినిస్ట్రీస్ చేయూత



రావులపాలెం : పేదలకు అన్నదానం చేయడంలో భగవంతున్ని చూడవచ్చని నేషనల్ లా కౌన్సిల్ మెంబర్ డా॥ జివిఎస్ఎస్ వర ప్రసాద్ అన్నారు. సోమవారం మండల పరిధి ఊబలంకలో అన్నా మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుప్రింకోర్టు, హైకోర్టు న్యాయవాది, నేషనల్ లా కౌన్సిల్ మెంబర్ డా॥ జివిఎస్ఎస్ వర ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భముగా 15 మంది పేదలకు 10 కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేసారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ పేదలకు ప్రతి ఒక్కరు అన్నదానం చేయాలని, పేదల్లో భగవంతున్ని చూడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఐఇ కుమార్, జాతీయ బిషప్ కౌన్సిల్ అధ్యక్షుడు జార్జి పాఫప్, రాజేష్ కుమార్, కోనాల సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# మట్టి ముద్దలతో మనోహర రూపాలు

## - వేసవి వినోదంలో మిమిక్రీ , వెంట్రీలాక్విజమ్...

## - బంక మట్టితో పక్షులు... జంతువుల తయారీపై శిక్షణ



కాకినాడ : విద్యార్థులకు ఏకాగ్రత, ప్రేరణ కలిగించడంవలన జ్ఞాపక శక్తి పెంపొందుతుందని ఆప్‌కాస్ట్ జిల్లా సమన్వయ కర్త కేసరి శ్రీనివాసరావు అన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి( ఆప్‌కాస్ట్)ఆధ్వర్యంలో స్థానిక జగన్నాధపురం ఎంఎస్ఎన్ చార్టీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిభిరంలో విద్యార్థులకు జ్ఞాపకశక్తి, ఏకాగ్రత,ధారణకు వంటి అంశాలపై శిక్షణనిచ్చారు.కల్చరల్ విభాగంలో మిమిక్రీ వెంట్రిలిక్విజమ్ సండంధించి రిసోర్స్‌పర్సన్ వివిఎస్‌వి రమణమూర్తి ప్రదర్శన ఇవ్వడంతో పాటు పిల్లలకు సులభపద్ధతులు నేర్పి వారికి మిమిక్రీ,వెంట్రీలాక్విజమ్ మంకీ పప్పెట్‌తో ప్రదర్శన ఇప్పించారు.అలాగే జ్ఞాపక శక్తితక్కువ అని తెలిపిన విద్యార్థులకు శిఓన అనంతరం అలవోకగా 25 ఆంగ్ల పదాలను కేవలం 5నిమిషాలలో గుర్తుంచుకొని వరుస తప్పకుండా ఆరోహణ,అవరోహణ క్రమంలో నేర్పడం విద్యార్థులలో మంచి ఉత్సాహాన్ని నింపింది.అలాగే బంక మట్టిని ఉపయోగించి విద్యార్థులు వివిధ నమూనాలను తయారు చేసారు. బొమ్మలను పరిశీలించి రూపాలను ఎలాదిద్దాలో ఎండి.సమీర్,కె.దేవుడు శిక్షణ ఇచ్చారు. మట్టిని పిసకడంవలన పిల్లలో అంతర్గతంగా ఉన్న ఆందోళనలు, ఒత్తిడులు వంటి భావోద్వేగాలు తొలగుతాయని, మట్టి ముద్దలకు మనోహర రూపాలను కల్గిండం ద్వారా వారిలో సృజనాత్మకశక్తి బయటకు వస్తుందని రిసోర్స్ పర్సన్ వివరించారు.విద్యార్థులు నెమలి,తాబేలు,, ఏనుగు, వినాయకుడు, బాతులు వంటి బొమ్మలు తయారు చేసారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఎస్.సుబ్రహ్మణ్యం ,ఉపాధ్యాయులు పి.సత్తిబాబు, కె.స్వరూప తదితరులు పాల్గొన్నారు.

చదవండి..
చదివించండి
విజయభాను

## గ్రంధాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు



అచ్యుతాపురం : మండల కేంద్రమైన అచ్యు తాపురం శాఖ గ్రంధాలయంలో గ్రంధాలయా ధికారి డి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. సోమ వారం వేసవి శిక్షణా తరగతులలో భాగంగా విశ్రాంతి ఉపాధ్యా యుడు జె కాశీరావు విద్యార్థులకు తెలుగు సాహిత్యంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు గ్రంధాలయాలకు వెళ్లి పుస్తక పఠనం చేయాలని ఆయన సూచించారు. గ్రంధాలయాధికారి కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల అభిరుచులను బట్టి ప్రత్యేక ఉపాధ్యాయులచే శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు .

## స్వామి వార్కి తిరు నక్షత్ర ఉత్సవాలు

రావులపాలెం : వాడపల్లిలో వేంచేసియున్న శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భగవత్ రామానుజాచార్యుల తిరునక్షరత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

మొదటి రోజు స్వామికి సేవాకాలం, దివ్య ప్రభంధ పారాయణ, వేదస్వస్థి, పల్లకి ప్రదక్షిణలు, తీర్థ ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు ఆలయ అర్చకులు, వేద పండితుల నడుమ హిందూ సాంప్రదాయం ప్రకారం, వైష్ణవాచారం ప్రకారం శాస్త్రోక్తముగా నిర్వహించారు.



# ఓటేసిన ప్రముఖులు

# ప్రశాంతంగా ఐదో విడత పోలింగ్

న్యూఢిల్లీ: సార్వత్రిక సమరంలో భాగంగా జరుగుతోన్న ఐదో విడత పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది. కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్, కేంద్ర మాజీ మంత్రి యశ్వత్ సిన్హా, బీఎస్పీ అధినేత్రి మాయావతితో పాటు పలువురు ప్రముఖులు సోమవారం తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. దేశంలోని 7 రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న 51 నియోజకవర్గాల్లో ఐదో దశ పోలింగ్ ఉదయం 7గంటలకు ప్రారంభమైన విషయం తెలిసిందే.

కేంద్ర హోంమంత్రి, లఖ్‌నవూ భాజపా అభ్యర్థి రాజ్‌నాథ్ సింగ్ నగరంలోని పోలింగ్ బూత్ నెంబరు 333, స్కాలర్స్ హోమ్ స్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. లఖ్‌నవూలో తన విజయం తథ్యమని.. మెజార్టీ ప్రజలు నిర్ణయిస్తారని వ్యాఖ్యానించారు.

కేంద్ర మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ ఆయన సతీమణి గాయత్రితో కలిసి జైపూర్‌లో ఓటేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈసారి ఎన్నికలో భాజపా విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

బీఎస్పీ అధినేత్రి మాయావతి లఖ్‌నవూలోని మొంటెస్సోరీ ఇంటర్ కాలేజ్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం దృష్ట్యా ప్రతి ఒక్కరూ తమ హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా ఆయన సతీమణి నీలిమా సిన్హాతో కలిసి ఝార్ఖండ్‌లోని హజారీబాగ్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆయన కుమారుడు కేంద్ర మంత్రి జయంత్ సిన్హా హజారీబాగ్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే.

**ఓటేసిన ఎంపీ కవిత**

నిజామాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా నవీపేట్ మండలం పోతంగల్‌లో ఎంపీ కల్వకుంట్ల కవిత ఓటు వేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. అన్ని చోట్ల టీఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుంద్ని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ సహకరించి టీఆర్ఎస్ ఎంపీటీసీ, జడ్పీటీసీలను గెలిపించుకొని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే వార్‌వన్‌సైడ్ ఉంటుంది. దేశంలో కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపారు. దేశాభివృద్ధి కోసం అన్ని పార్టీలను ఏకం చేయడానికి సీఎం కేసీఆర్ రాష్ట్రాల పర్యటన చేస్తున్నారని కవిత వివరించారు. ఓటు ఉన్న ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాసని ట్విట్టర్‌లో పిలుపునిచ్చారు.

**ఓటేసిన ధోనీ**

రాంచి: గత కొద్దిరోజులుగా ఐపీఎల్ టోర్నీలో వివిధ వేదికల్లో మ్యాచ్‌లతో బిజీబిజీగా ఉన్న చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ ఓటు హక్కు వినియోగించుకున్నాడు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఝార్ఖడ్‌లోని రాంచీలో గల జవహర్ విద్యా మందిర్‌లో తన కుటుంబసభ్యులతో వచ్చి మహీ ఓటు వేశాడు. ధోనీతో పాటు భార్య సాక్షి సింగ్, కూతురు జీవా ఉన్నారు. పోలింగ్ కేంద్రం ఆవల ధోనీతో ఫొటోలు దిగేందుకు అభిమానులు పోటీపడ్డారు.









## జేఈఈ మెయిన్, సిబిఎస్ఇ ప్లస్, మరియు సిబిఎస్ఇ క్లాస్ 10 ఫలితాల్లో...

# వికాస్ విజయకేతనం



విశాఖ సిటీః దేశవ్యాప్తంగా సోమవారం విడుదలైన సిబిఎస్ఇ 10వ తరగతి ఫలితాలలో వికాస్ విద్యాసంస్థలు ఎప్పటిలాగే మరోసారి విజయకేతనం ఎగురవేశాయి. జాతీయస్థాయిలో వికాస్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. అలాగే సిబిఎస్ఇ ప్లస్ 2 ఫలితాలలోనూ, జేఈఈ మెయిన్ ఆలిండియా ర్యాంకుల సాధనలోనూ వికాస్ విద్యార్థులు అద్భుత విజయం సాధించారు. ఈ సందర్భంగా విశాఖపట్నంలోని వికాస్ విద్యాసంస్థల యాజమాన్యం పత్రికకు ఓ ప్రకటనను విడుదల చేసింది. ఈ ప్రకటనలో సోమవారం విడుదలైన సిబిఎస్ఇ 10వ తరగతి ఫలితాలలో తమ విద్యార్థి సురేంద్ర ప్రసాద్ 483 మార్కులు సాధించి వికాస్ కీర్తి ప్రతిష్టను జాతీయస్థాయిలో మరోసారి ఇనుమడింపజేసారని తెలిపారు. అలాగే 478, 466, 468, 442, 434, 429, 417, 403,... వంటి అత్యుత్తమ మార్కులను మరెందరో విద్యార్థులు సాధించారని తెలిపారు. సిబిఎస్ఇ ప్లస్2లో జాతీయస్థాయిలో 487మార్కులు తమ విద్యార్థి స్వస్తిక్ రాజ్ సాధించి ఆంధ్రప్రదేశ్ లో నెం. 1స్థానంలో నిలిచాడని పేర్కొన్నారు. 90%పైగా మార్కులను 40మంది విద్యార్థులకు పైగా సాధించారని, అలాగే 207మంది విద్యార్థులు డిస్టింక్షన్ లో ఉత్తీర్ణులయ్యారని అన్నారు. ఇక జేఈఈ మెయిన్ 2019 ఫలితాలలో తమ విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ తోపాటూ, నేడు ఆలిండియా ర్యాంకులు సొంతంచేసుకున్నారని తెలిపారు. తద్వారా జేఈఈ అడ్వాన్స్ కు అర్హత పొందారని తెలిపారు. ఈ ఘనవిజయాలకు కారణం ఐఐటి లక్ష్యసాధకులకోసం వికాస్లో ప్రత్యేకంగా ప్రోగ్రామ్ రూపొందించడం జరిగిందని, ఐఐటి శిక్షణలో నిపుణులైన ఫ్యాకల్టీచే పటిష్ట శిక్షణనివ్వడం అనుభవం అంకితభావంగల అధ్యాపకులచే ప్రాక్టీస్ చేయించడం జరుగుతుందని, కనుకనే వికాస్లో వందలాది విద్యార్థులు జేఈఈ మెయిన్ లో పలు జాతీయస్థాయి ర్యాంకులు సాధించగలిగారని అన్నారు. ఇంజనీరింగ్ లక్ష్యంగాగల విద్యార్థులు తమ ఐఐటి కలలను వికాస్ విద్యాసంస్థద్వారా నిజం చేసుకుంటున్నారని, ఐఐటి లక్ష్యసాధకుల వేదికగా వికాస్ నిలవటం తమకెంతో గర్వకారణంగా ఉందని అన్నారు. విశాఖపట్నంలో రెండున్నర దశాబ్దాల విజయచరిత్రగల వికాస్ విద్యాసంస్థలు జాతీయస్థాయి సిబిఎస్ఇ విద్యకు అత్యుత్తమ వేదికలుగా నిలిచాయని ఈ సందర్భంగా తెలిపారు. వికాస్లో అడుగు పెట్టిన ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధను కనబరచడం, ప్రతి విద్యార్థి విజయంకోసం కృషిచేయడం వికాస్ విద్యాసంస్థల లక్ష్యమని తెలిపారు. ఇక రెసిడెన్షియల్లోచేరిన విద్యార్థులకు ఇంటి వాతావరణం కల్పించడం, రుచిశుచికరమైన ఆహారం అందించడం, కంటికి రెప్పలా కాపాడటం, వారి ఆరోగ్యం, రక్షణ విషయంలో ప్రత్యేక శ్రద్ధపెట్టడంవల్లనే వందలాది తల్లిదండ్రులు తమ పిల్లల ఉజ్వల భవితకోసం వికాస్లో చేర్పించడానికి ఆసక్తిని కనబరుస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలను, విద్యార్థుల విజయంకోసం నిరంతరం కృషిచేస్తున్న అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందికి శుభాభినందనలను వికాస్ సిఇఓ ఆర్ ఈశ్వరన్ తెలిపారు.

## తెలంగాణ విద్యాశాఖ కీలక నిర్ణయం

హైదరాబాద్: పదో తరగతి విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని తెలంగాణ విద్యాశాఖ నిర్ణయించింది. పరీక్ష ఫలితాల వెల్లడికి ముందు, తర్వాత కౌన్సెలింగ్ నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ప్రధానోపాధ్యాయులంతా ఆయా పాఠశాలల్లో కౌన్సెలింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 9 లేదా 10న విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రధానోపాధ్యాయులు సమావేశం నిర్వహించాలని సూచించారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ఉన్నత విద్యలో అవకాశాలపై దిశానిర్దేశం చేయాలన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులు కుంగిపోకుండా భరోసా కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించింది.

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

వేలూరు: తమిళనాడులోని వేలూరు పరిధి అంబూరు రహదారిపై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రహదారి పక్కనే ఆగి ఉన్న ట్రక్కుపైకి ఓ కారు దూసుకెళ్లడంతో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు.

మృతుల్లో ఇద్దరు మహిళలు, మరో ఇద్దరు చిన్నారులతో పాటు మొత్తం ఏడుగురు ఉన్నారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారిగా తెలుస్తోంది. ఘటనాస్థలంలో దొరికిన ఆధారాల ప్రకారం మృతులంతా మహారాష్ట్రకు చెందిన వారిగా పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదానికి గురైన వాహనం నుంచి మృతదేహాలను పోలీసులు వెలికితీశారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## స్త్రీలు ఆరోగ్యప్రదంగా ఉండాలి



మురళీనగర్ః సమాజంలో స్త్రీలు తమ ఆరోగ్యంపట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఆంధ్రా మెడికల్ కాలేజి ఎన్. శిరీష పేర్కొన్నారు. సోమవారం మురళీనగర్‌లోగల వనీతా వాకర్స్ క్లబ్ నెలవారీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న శిరీష్ మాట్లాడుతూ స్త్రీలు ఆరోగ్యప్రదంగా ఉంటాలంటే రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెంచుకోవాలని సూచించారు. ఇందుకు బెల్లంతో కలిపిన పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఎండుఖర్జూరం, తదితర డ్రైఫ్రూట్స్ తీసుకోవడం ద్వారా రక్తం శుద్ధి జరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. వనితా వాకర్స్ క్లబ్ చేస్తున్న సేవలు అనిర్వచనీయమని కొనియాడారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్ష కార్యదర్శులు జె. ఉమాదేవి, కె. మాధవి, కోశాధికారి ఇందిర, ఉపాధ్యక్షురాలు వి.జయప్రభాశర్మ, సిహెచ్ జ్యోతి, రోజా, జ్యోత్స్న, శిరీష, స్నేహలత, పద్మ, జయ, శకుంతల, ప్రభావతి, పూర్వ అధ్యక్షులు శుభ, వి. ప్రమీల, బిందు, మహాలక్ష్మి, దుర్గాప్రసన్న, లక్ష్మీప్రసన్న, ఇంకా అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు. ముఖ్య అతిధిని ఘనంగా సత్కరించారు. వోట్ ఆఫ్ థ్యాంక్స్, జనగణమన, జాతీయగీతంతో ఈ కార్యక్రమం ముగిసింది.

# బాసర అమ్మవారి కిరీటంలో కెంపు మాయం

బాసర : ప్రసిద్ధిగాంచిన బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో అధికారుల నిర్లక్ష్యం మరోసారి బట్టబయలైంది. ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్ విగ్రహం మకుటంలోని ఓ వజ్రం కనిపించకుండా పోయింది. నవరత్నాలతో కూడిన అమ్మవారి కిరీటంలో ఓ కెంపు గల్లంతయినట్లు గుర్తించిన భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ వ్యవహారం కాస్తా వివాదాస్పదంగా మారటంతో దేవదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి విచారణకు ఆదేశించారు.


కెంపు గల్లంతుకు సంబంధించి పూర్తి నివేదిక సమర్పించాలని మంత్రి, దేవాదాయ శాఖ కమిషనర్‌ను ఆదేశించారు.

ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో విగ్రహాన్ని మరో ప్రాంతానికి తీసుకొచ్చి పూజలు నిర్వహించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆలయ అధికారులు... మరోసారి ఇంకో వివాదంలో ఇరుక్కోవడం గమనార్హం.



## పోలింగ్ శాతం పెరగడం మనకే కలిసొచ్చింది

### అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ సమీక్షలో చంద్రబాబు




అమరావతి: గత 37 ఏళ్లుగా తెదేపా అనేక ఎన్నికలు చూసిందని.. కానీ ఏ ఎన్నికల్లో లేని అడ్డంకులు ఈ ఎన్నికల్లో ఎదురయ్యాయని ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు అన్నారు. గుంటూరు జిల్లా ఆత్మకూరు హ్యాపీ రిసార్ట్స్‌లో నిర్వహించిన అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ సమీక్షలో సీఎం మాట్లాడారు. తెదేపా క్రమశిక్షణకు మారు పేరని.. సంస్థాగతంగా బలమైన పునాదులు కలిగి ఉందని చెప్పారు. పటిష్ఠమైన వ్యవస్థగా పార్టీని రూపొందించడమే మన లక్ష్యమన్నారు. పార్టీ విజయానికి కార్యకర్తలు ప్రాణాలకు తెగించి పనిచేశారని కొనియాడారు. అనేక అడ్డంకులను అధిగమించి ఓట్లేశారని.. పట్టుదలగా ముందుకొచ్చి పోలింగ్‌లో పాల్గొన్నారంటూ అందరికీ అభినందనలు తెలిపారు.

తొలిదశలో ఎన్నికలతో తెదేపాకే సానుకూలం

ఈసారి తొలిదశలోనే ఎన్నికలు నిర్వహించడం తెదేపాకే సానుకూలమైందన్నారు. పోలింగ్ శాతం పెరగడం కలిసివచ్చే అంశమని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి భాజపా నేతలు అడుగడుగునా ఆటంకాలు కల్పించారని.. ప్రశ్నించామనే అక్కసుతోనే మనపై ఎదురుదాడులకు తెగబడ్డారని చంద్రబాబు ఆరోపించారు. స్థానికంగా వైకాపా నేతలు పదేపదే ఫిర్యాదులు, కేసులతో అడ్డంకులు సృష్టించారన్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని.. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, పురపాలక ఎన్నికల్లోనూ తెదేపా గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షకు అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని రాజోలు, గన్నవరం, ముమ్మడివరం, కొత్తపేట, మండపేట, రామచంద్రాపురం, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గాల పార్టీ అభ్యర్థులు, నాయకులు హాజరయ్యారు. అక్కడి పోలింగ్ సరళి, బూత్‌ల వారీగా వచ్చిన ఓట్ల వివరాలపై చంద్రబాబు నేతలతో సమీక్షించారు.

## కేరళ సీఎంతో కేసీఆర్ భేటీ



తిరువనంతపురం: సమాఖ్య కూటమి ఏర్పాటును ప్రక్రియను తెరాస అధినేత, తెలంగాణ సీఎం కేసీఆర్ వేగవంతం చేశారు. దీనిలో భాగంగా కేరళ పర్యటనకు వెళ్లిన సీఎం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో భేటీ అయ్యారు. దేశంలోని తాజా రాజకీయ పరిస్థితులపై ఇరువురు నేతలు చర్చించారు. లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న తీరు, ఫలితాల సరళి ఎలా ఉండబోతోంది, ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు ఆవశ్యకత, భాజపా, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఇతర పార్టీలు ఏకమయ్యేందుకు నిర్వహించాల్సిన పాత్ర తదితర అంశాలపై కీలకంగా చర్చించినట్లు సమాచారం. ఈ భేటీలో కేసీఆర్ వెంట ఎంపీలు వినోద్, సంతోష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సోమవారం ప్రత్యేక విమానంలో కేరళకు బయల్దేరి వెళ్లిన కేసీఆర్.. కుటుంబ సభ్యులతో కలిసి తిరువనంతపురంలో అనంత పద్మనాభస్వామి ఆలయాన్ని దర్శించుకున్న విషయం తెలిసిందే.













# నేడే అప్పన్న నిజరూప దర్శనం

- వేకువజామున 4గంటలనుండి భక్తులకు దర్శనములు
- భారీ ఏర్పాట్లు చేసిన దేవస్థానం
- జిల్లా కలెక్టర్, నగర పోలీసు కమిషనర్ పర్యవేక్షణ
- భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సు ఉచిత సర్వీసులు
- టికెట్ల కొనుగోలుకు సింహగిరిపై ప్రత్యేక కౌంటర్
- గంగధార వద్ద నుండి తెచ్చిన సహస్ర కలశాలతో అభిషేకం
- తొలివిడత సమర్పణ మూడు మణుగుల చందనం
- పూసపాటి వంశీయులకు తొలి దర్శనం

సింహాచలం : ఆంధ్రుల ఆరాధ్యదైవం శ్రీ సింహాచల వరాహ లక్ష్మీ నృసింహ స్వామివారి నిజరూప దర్శనం నేడు కనులపండుగగా జరుగనుంది.ఈ మేరకు జిల్లా కలెక్టర్ కె.భాస్కర్ పర్యవేక్షణలో అన్ని శాఖల అధికారులు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చందనయాత్ర మహోత్సవాన్ని నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. నగర పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో సుమారు 1600 మంది పోలీస్ సిబ్బంది ఈ వేడుకలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటికే 1000 రూపాయల వీఐపీ టిక్కెట్లు, 500, 200 రూపాయల టిక్కెట్లు విరివిగా అమ్ముడు పోయాయి.ఈ సారి రెండు నుండి మూడు లక్షల మంది భక్తులు చందనయాత్రలో పాల్గొంటారని దేవస్థాన వర్గాల అంచనా. క్యూ లైన్‌లలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఎక్కడికక్కడ త్రాగునీటి, మజ్జిగ, అల్పాహారం పంపిణీ చేయడానికి పలు స్వచ్ఛంధ సంస్థలు ముందుకు వచ్చాయి. అలాగే ఉచిత అన్నప్రసాద పంపిణీ కూడా నిరంతరాయంగా చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఉదయం 4 గంటలు నుండి సాయంత్రం 4 గంటల వరకు ఆర్టీసీ బస్సులు నిరంతరాయంగా నడుపనునట్లు అధికారులు తెలిపారు. ఈ సమయాలలో లైన్లలో ఉన్న భక్తులు అందరికీ స్వామివారి దర్శన భాగ్యం కలుగుతుంది. చందనయాత్ర సందర్భంగా పలు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తామని నగర ట్రాఫిక్ ఏ.డి.సి.పి తెలిపారు. దీని ప్రకారం హనుమంతవాక మీదుగా సింహాచలం వచ్చే వాహనాలను అడవివరం గ్రౌండ్ వరకు మాత్రమే అనుమతిస్తామని, భక్తులు అక్కడే తమ తమ వాహనాలను పార్కింగ్ చేసుకుని ఆర్టీసీ బస్సులలో ఉచితంగా కొండపైకి చేరుకోవచ్చునని పేర్కొన్నారు.

అలాగే గోపాలపట్నం, వేపగుంటల మీదుగా వచ్చే భక్తులకు పాత గోశాల వద్దకు మాత్రమే అనుమతిస్తామని చెప్పారు. అక్కడ బస్సులు అధిక సంఖ్యలో కొండపైకి నడుస్తాయని చెప్పారు. దర్శన టికెట్లు నిర్దేశిత బ్యాంక్‌ల ద్వారా నగరంలో పలు ప్రాంతాలలో విక్రయించారు. ఒకవేళ టిక్కెట్లు కొనలేని వారికి సింహగిరి పై ప్రత్యేక కౌంటర్‌ల ద్వారా లభిస్తాయి. భక్తులు ముఖ్యంగా గమనించ వలసిన విషయం ఏమిటంటే 500, 200 రూపాయల టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులు ఆ రోజు ఉదయం 4 గంటల నుంచి, సాయంత్రం 6 గంటల లోపు దర్శనానికి వెళ్ళాలి. ఆ సమయాలలో మాత్రమే వీరిని అనుమతిస్తారు. జీవీఎంసీ, వైద్య ఆరోగ్య, పోలీస్, ఆర్టీసీ, దేవస్థాన తదితర విభాగాల అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు శత శాతం జరిగాయి.

నేటి వేకువ జామున శ్రీ స్వామివారిని మేల్కొలిపి ప్రత్యేక పూజలు జరిపి ఆలయ ప్రధాన అర్చకులు బంగారు, వెండి బొరిగెలతో స్వామి వారిపై నున్న చందనాన్ని తొలగిస్తారు. అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం పూసపాటి వంశీయులకు తొలి దర్శన భాగ్యం కలిగిస్తారు. అనంతరం భక్తులకు, వీఐపీలకు, రాజకీయ ప్రముఖులకు శ్రీ సింహాద్రి నాధుని దర్శన భాగ్యం కలుగుతుంది. రాత్రి వరకు స్వామివారి దర్శన భాగ్యం అందరికీ కలుగుతుంది.

అనంతరం 1008 కలశాలతో స్వామివారికి సహస్ర ఘటాభిషేక కార్యక్రమం ద్వారా ముందుగానే ఎంపిక చేసుకున్న వైష్ణవ స్వాములు పవిత్ర గంగధార వద్ద నుండి తెచ్చిన పవిత్ర జలాలతో అభిషేకించి తొలి విడతగా మూడు మణుగుల చందనాన్ని స్వామివారికి అలంకరిస్తారు. ఈ వేడుకను తిలకించడానికి రాష్ట్రంలోనే కాకుండా దేశ విదేశాలనుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.


చందనాన్ని సిద్ధం చేస్తున్న అర్చక స్వాములు


భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మంచినీటి ప్యాకెట్లు


ఎండ తీవ్రతను తట్టుకునేందుకు ఏర్పాటైన చలువపందిళ్లు


తొలిపూతకు తయారైన చందనం


తొక్కిసలాటలు జరగకుండా ఏర్పాటైన క్యూలైన్లు..

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com